
47 64



సంపుటము ౮] రాజమహేంద్రవరము

రాజరాజు

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి
సంపాదకుడు

నాలుగో రంగం

రాజరాజు ఏకాంతమందిరం.

రాజమహేంద్రపురదుర్గంలో, అది, పశ్చిమప్రాకారానికి కొంచెం చేరికగా వున్నది.

రాజు నిత్యనివాసం అక్కడే. మజ్జనభోజనాదులు కూడా తరుచు అక్కడే జరుగుతూ వుంటవి. సారంగధరుడి కేడెనిమిదేళ్ల వయస్సు వచ్చినప్పణ్ణుంచీ అతనీ యేర్పాటు చేసుకున్నాడు. కభురు వచ్చినప్పుడూ, తనకి బుద్ధి పుట్టినప్పుడూ అతను రత్నాంగి నగరికి వెడుతూ వుంటాడు. రత్నాంగిన్నీ యెప్పుడేనా అక్కడికి వెళ్లడం కద్దు.

రత్నాంగి నగరు, ఆమందిరానికి, ఎడమపక్కన ఫర్లాంగుదూరాన వున్నది. ఎదట, అంతే దూరాన సభాభవనం. మరిన్నీ, కుడిదిక్కున కూడా అంతే దూరాన వాళ దివ్యభవనం వున్నది.

అది రాజు విలాసభవనం. వెలలేని వస్తువు లందులో యెన్నో వున్నవి. చాళుక్యవంశీయుల వైభవానికి అది ప్రదర్శనశాల అని చెప్పవచ్చు. అయితే: రాజు, అందులోకి యెలాంటప్పుడు నడిచేవాడో, యెందుకు నడచేవాడో, వెళ్లి యెంతసేపు వుంటాడో యెవరికీ తెలవదు.

భృత్యుల్లో కూడా అనేకులకు అక్కడికి వెళ్లడానికి సెలవు లేదు. ఉన్నవారిలో అయినా చాలామంది యువతులు.

ఆమందిరం పూచీ అంతా మహారుద్రయ్యది.

* * * *

అప్పటికి జాము పొద్దున్నది.

రాజు ఏకాంతమందిరంలోనే వున్నాడు.

అది కొలువుతీరి వుండవలసిన సమయం అయినా, నాలుగైదు రోజులనుంచి, అతను, ఆమందిరం విడిచి పెట్టడం లేదు. రాజకార్యాలన్నీ అష్టప్రధానుల ద్వారా అక్కడే పరిష్కారం అవుతున్నవి.

తరుచు రాజసభకి వెళ్లే పౌరులలో చాలామంది చాలా నిరుత్సాహంగా వుంటున్నారు.

దేశదేశాలనుంచి వచ్చిన కళాకుశలులు కూడా యెటూ సాహసించలేక ముళ్లమీద వున్నట్టున్నారు.

నృత్యగీతాది వినోదాలకు లోటు లేకపోవడంవల్ల

రాజు పని మామూలుగానే వున్నది; కాని, పట్నం అంతా రాజు లేనట్టు బావురోమంటూ వున్నది.

ఈనాలుగైదురోజుల్లోనూ మూడు పూట్లు కాబోలు అతను రత్నాంగి నగరికి వెళ్ళాడు. అంతే. మరి గుమ్మం దిగలేదు.

మంత్రులకూ, విజయాదిత్యుడికీ, సారంగధరుడికీ, కోట వస్తే రత్నాంగికీ, సన్నయకూ తప్ప మరెవరికీ దర్శనం లేదు.

మహాసుద్రయ్యమాత్రం అష్టగడియలూ అక్కడే వుంటున్నాడు. ఒక్క భోజనానికి మాత్రమే అత నింటికి వెడతాడు.

* * * *

రాజు, బాలీసుకి ఆనుకుని, రత్నకంబళీమీద కూచుని వున్నాడు. ఎదట గోడకి చేర నిలువుటద్దం వున్నది. ముందు సందుకా పెట్టె, దానిమీద ఆంధ్రమహాభారతం సభాపర్వమూ వున్నవి.

గది అంతా అగరువత్తుల పరిమళం గుమాయిస్తున్నది.

రాజు, పాముకూసం వంటి తెల్లటి పంచె కట్టుకుని, అలాంటిదే పట్టు అంగీ తొడుక్కుని, గిరజాలు చక్కగా సవరించుకుని వున్నాడు. తాంబూలరక్తిమాంకైన పెదవులు, తెలుపు ఎక్కువగా వున్న మీసాలకు వింత సోయగం కూరుస్తున్నవి. సీమకమలాల ధగధగలూ, "కొనకాడ" పచ్చ నిగనిగలూ చెక్కుటద్దాలలో ప్రతిఫలిస్తూ మెరుపుతీగలు పరుపుతున్నవి. జానువుమీదికి చాపుకుని వున్న కుడిచేతి రత్నాంగుళీయకం ఎదటివారి కన్నులు కుట్టుతున్నది.

ఎదట, కొంచెం కుడిగా, మహామంత్రి చిట్టివీరన్నా, కొంచెం యెడమగా సన్నయభట్టూ మండెమీద కూచుని వున్నారు.

విచ్చుకత్తులతో, యిద్దరు యువతులు, వొకమాటు లోపలికి కీగంట చూస్తూ, వొకమాటు తమలో తాము గంభీరంగా చూసుకుంటూ, చాలా నిక్కచ్చిగా ద్వారపాలనం చేస్తున్నారు.

వసారాలోనుంచి కపుజుపిట్టల కోలాహలం శ్రావ్యంగా వినవస్తున్నది.

సన్నయభట్టు — యువరాజులుంగారి ప్రణయగాథ అలా వుంచుదాం. చిత్రపటాలు రాకపూర్వం తమకు వివాహసంకల్పం లేదు.

రాజరాజు—సెల విప్పించండి.

సన్నయభట్టు—వచ్చిన చిత్రపటా లన్నీ యువరాజులుంగారి నిమిత్తమే వచ్చినవి.

రాజరాజు—కానివ్వండి.

సన్నయభట్టు—ఆచిత్రాలకు సంబంధించిన రాజపుత్రికలలో వొకామే—లేక—కొందరే యువరాజులుంగారికి నచ్చుతారు; కాని ఆరాజపుత్రికలకు మాత్రం అందరికీ అబ్బాయిగా రంటే యిష్టమే.

రాజరాజు—అది వివాదాస్పద మైన విషయం. అయినా తమ సెల వేమిటో కానివ్వండి.

సన్నయభట్టు—అనురాగంవల్లా భక్తివల్లా కాకపోయినా —భయంవల్ల అయినా ఆరాజపుత్రికల కందరికీ యువరాజులుంగా రంటే భర్తృభావం యేర్పడింది.

రాజరాజు—మన అబ్బాయి తిరస్కరిస్తే, మరి, ఆరాజపుత్రికలు పెళ్లిచేసుకో రంటారా తమరు?

సన్నయభట్టు—సావిత్రీదేవమ్మగారి విషయమూ, అంబగారి విషయమూ మన కందరికీ తెలిసినవే. లోకంలో కూడా యింకా అనేకరకాలు అనుదినమూ మనం చూస్తూనే వున్నాము. ఏది యేమయినా, ఆరాజపుత్రిక లందరూ యేలినవారికి కోడలువావివా రని అంగీకరించకతప్పదు.

రాజరాజు—(కొంచెం తీవ్రంగా) ఆవావి తప్పనీ, పనికిరా దనీ, త్యాజ్యం అనీ యేగ్రంథంలో వున్నదీ?

సన్నయభట్టు—(చకితుడై, వాక్కత్రుణం నిరుత్తరుడై వుండి) అర్థాలు తియ్యడమే పనిగా పెట్టుకుంటే యేది యేమయినా చెయ్యవచ్చు. అయితే: వావి అంటే అంతమాత్ర మేనా? యువరాజులుంగా రే రాజపుత్రికనో యేరుకుని వరించే దాకా మొత్తానికి వారందరూ తమకు కోడళ్లే.

రాజరాజు—(వెటకారంగా నవ్వి)తమరు విడ్డూరాలు సెల విస్తున్నారు. మహాకవీ ! ధార్మిక విషయాలు తమకు తెలవనివి లేవు. తమరు సూక్ష్మవిచారణ చెయ్యాలి. తతిమ్మా సందర్భాలకు తమరు ప్రాధాన్యం యివ్వకూడదు.

నన్నయభట్టు—సూక్ష్మవిచారణ చేసే నేను మనవి చేసుకుంటున్నాను.

రాజరాజు—లేదు. ఎంత మాత్రమూ లేదు. తమరిప్పుడు కవితావేశంతో మాట్లాడుతున్నారు. అంచేత తమ రిప్పుడు భ్రాంతచిత్తులై వున్నారు.

నన్నయభట్టు—భ్రాంతా ? మహాప్రభూ ! నాకు భ్రాంతా ?

రాజరాజు—(వొత్తి) అక్షరాలానూ. కాకేమీ ? పోనీ, రామభద్రరాజు కూతురు చిత్రం, మనం, అబ్బాయికి చూపించలేదు. తమ రిది గమనించారా ?

నన్నయభట్టు—చక్కగా గమనించాను. నేనొక్కణ్ణేకాదు, అబ్బాయిగారి వివాహం కోసం యేలినవారు చేసిన ప్రయత్నాలు తెలిసినవా రందరున్నూ పూర్తిగా గమనించారు. అంచేతనే నేనీవిషయం తమతో యింత దూరం మనవిచేసుకోవలసివచ్చింది. అసలు, ఆపటం, అబ్బాయిగారికి చూపించకపోవడమే తప్పు. అదే తప్పులకు ప్రారంభం కూడానూ. ఏమంటే ? అబ్బాయిగారి కోసమే తెప్పించబడిన పటాలలో వొకటి వారికి చూపించకపోవడం యెందుకు కలగాలీ ? ఏలినవా రిది గమనించారా ?

రాజరాజు—ధర్మనిర్ణయాన్ని పురస్కరించుకుని ప్రారంభం అయిన ప్రసంగం మరొక దారికి పోతున్నది. (చిట్టిపీరన్న కేసి చూస్తాడు)

చిట్టిపీరన్న—భట్టారకులవారు విషయదూరులు కావడం లేదనే నానమ్మకం మహాప్రభూ !

రాజరాజు—(తిరస్కారంగా) అలాగా ?

నన్నయభట్టు—ప్రభూ ! నేను విషయదూరుణ్ణి కావలసిన సన్నివేశం యేమి వచ్చిందీ ? ఇది క్లిష్టమైన విషయం కాదే ? ధర్మాన్ని అంగీకరించడం వేరూ, ఆచరించడం వేరూ కావచ్చు గాని—(అర్థోక్తి)

రాజరాజు—(దారి దొరికిందన్నట్టు ఉత్సాహంతో) రాజనీతికి ధర్మమూ అధర్మమూ ప్రతిబంధకాలా మహాకవీ ?

నన్నయభట్టు—ఇక్కడ రాజనీతికి ప్రసక్తి యేమిటి మహాప్రభూ ? ఏలినవారి కిది కేవలమూ సాంసారిక విషయం. ఏలినవారి వంశకర్తలలో నొకరైన ప్రతీప మహారాజులుంగారు, కుడితొడమీద కూచున్నంత మాత్రాన కోడలుగా భావించి, కోరి వచ్చిన గంగాదేవమ్మగారిని తిరస్కరించారు. తమరున్నూ ఆమర్యాదా పాటించడం—(అర్థోక్తి)

రాజరాజు—దాని కిక్కడ పోలికే లేదు. ఇలాంటి కుశ్శంకలు పెంచుకున్నామంటే మనం క్షణం అయినా నెగ్గలేము.

నన్నయభట్టు—(చురచుర చూస్తూ) మహాప్రభూ ! యుక్తులకు స్థానాస్థానా లున్నవి. అధికారానికిన్నీ పరిమితి వున్నది. ఎటు చూసినా ధర్మానికి ప్రాతికూల్యం వహించడం శ్రేయస్కరం కాదు. చెయ్యి పట్టుకుని యేలినవారిని ప్రవర్తింపచెయ్యడానికి నాకు సత్తా చాలదు; కాని కన్యావరణంలో కొడుకుతో పోటీపడడం—(అర్థోక్తి)

చిట్టిపీరన్న—(నన్నయతో) మనవి చేసుకుంటాను. (రాజుతో) మహాప్రభూ! తమ రిప్పుడు చాలా దూరం ఆలోచించవలసివున్నది.

రాజరాజు—ఎంత దూరం ఆలోచించాలో (పెట్టె మీద గుద్దుతూ) అంత దూరమూ ఆలోచించే నే నీ పనికి పూనుకున్నాను. (నన్నయతో) తమరు, యికనైనా చర్వితచర్వణం కట్టిపెడితే చాలా బాగుంటుంది.

నన్నయభట్టు—(ఆవేశం అణచుకుంటూ) చిత్తం. కట్టిపెడతాను. మహాప్రభూ ! కట్టిపెట్టేస్తాను. నేను చేసేది చర్వితచర్వణం అని తమరునిక్కచ్చిగా సెలవిచ్చాటప్పుడు ఇక యేమి చెబితే మాత్రం—యెంత చెబితే మాత్రం యేమి లాభమూ ? అయితే, కల్లోలాలు చెలరేగే సూచనలు—(అర్థోక్తి)

రాజరాజు—కల్లోలాలా ?

నన్నయభట్టు—అవును, మహాప్రభూ ! అవును. ఆ వేళ—బహుజూహిూడ ప్రత్యేకంగా పరిశీలించాటప్పుడు, నేను, జక్కులదీవిమండలేశ్వరుల కొమార్తెగారి విషయమై చెప్పిన సత్యం—(అర్థోక్తి)

రాజరాజు—(విస్మయంగా చూస్తూ) అహా ? ఇంకా తమరు గతే పునశ్చరణ చేస్తూ వున్నారా ? బాగుంది. (దృఢస్వరంతో) మహాకవీ ! అప్పుడే అది అప్రస్తుతప్రశంస. మళ్ళీ ఆవిషయం తప్పక తలకెత్తుకోవడం అనుచితమైన పని. అదీ కాక. రామభద్రరాజు, తన కొమార్తెను నాకిచ్చి పెళ్ళి చెయ్యడానికి సర్వమూ సన్నద్ధం చేసుకుని వున్నాడు.

చిట్టిపిరన్న—ఇది కొత్తవిషయం. ప్రభూ ! వ్యవహారం అంతా చాలా రహస్యంగా జరిగినట్టున్నది.

రాజరాజు—రహస్యాని కేం వచ్చింది ? రామభద్రరాజు బహిరంగంగానే యీావిషయం తెలియపరిచాడు. అతని కూతురున్నూ త్రికరణశుద్ధిగా అంగీకరించింది.

చిట్టిపిరన్న—జక్కులదీవి మండలేశ్వరులే కోరి వర్తమానం చేసినట్టా ?

రాజరాజు—మహారుద్రయ్యగారు నిన్న వెళ్ళి వుండకపోతే అతనే వర్తమానించి వుండును.

చిట్టిపిరన్న—చాలా సంతోషం మహాప్రభూ !

రాజరాజు—(నన్నయతో) కనక, తమరు, అవసరమయితే మరొక విషయం మాట్లాడడం మంచిది.

నన్నయభట్టు—ఈవిషయం యిలా అయినప్పుడు మరొకవిషయం మాట్లాడితే మాత్రం యేమి ప్రయోజనమూ ? అసలు, మరొక విషయం మాత్రం యేమి వున్నదీ ? ధర్మానికి గ్లాని సంభవించినప్పుడు—(అర్థోక్తి)

రాజరాజు—ధర్మానికిప్పు డేమీా గ్లాని రాలేదు. ధర్మనిర్ణయంలో అభిప్రాయభేదం మాత్రమే సంభవించింది.

నన్నయభట్టు—అభిప్రాయభేదమా ? వింతగా వున్నది. కోడలుగా స్వీకరించదలచిన కన్యను భార్యగా పరిగ్రహిస్తూ అభిప్రాయభేదం అనడం చాలా సాహసమైన మాట. ప్రభువే యిలా చేస్తే యిక సామ్రాజ్యంలోనే ధర్మం లోపించిపోతుంది.

రాజరాజు—అయితే ; నేను, తమరు చెప్పినట్లా విననలసిందేనా ? ధర్మనిర్ణయంలో నాస్వబుద్ధిని వినియోగించుకోనే కూడదా ?

నన్నయభట్టు—ఆప్రశ్న యిక్కడ సంబద్ధంగా లేదు. నిజానికి, తమకి తెలియని ధర్మరహస్యాలు లేవు ; కాని యిది తమకు స్వంత విషయం. నిర్నిరోధంగా, స్వతంత్రిస్తే ప్రజాపాలనంలోనే తమకు ధర్మచ్యుతి కలిగించే సన్నివేశాలనేకా లేర్పడుతూ వుంటవి. ఇక స్వవిషయం అయినప్పుడది చెప్పడమెందుకూ ? ఇంతకీ: రాజ్యాంగంలో కులబ్రాహ్మణుని పదవి వినోదం కోసం సృష్టించబడ్డది కాదు—(అర్థోక్తి)

చిట్టిపిరన్న—(ఆదుర్దాతో—అంజలిబంధంతో)మహాకవీ ! మహాకవీ !

నన్నయభట్టు—(అది వినిపించుకోకుండా) ప్రాణకోటి అంతా ప్రభువుకి వశవర్తి ; కాని ప్రభువు మాత్రం కులబ్రాహ్మణుని ఆజ్ఞానువర్తిగా వుండితీరాలి.

చిట్టిపిరన్న—(అంజలిబంధంతో) మహాప్రభూ !

రాజరాజు—(వినిపించుకోకుండా నన్నయతో) అనవసరంగా తమరు వ్యగ్రులయిపోతున్నారు. దానికిప్పుడెంతమాత్రమూ కారణం లేదు. తమ పదవి కలుషితం కానే లేదు.

నన్నయభట్టు—అయితే ; ఏలినవారు జక్కులదీవి మండలేశ్వరుల కొమార్తెగారిమీాద అనురక్తులు కావడమూ, యీా వయస్సులో మళ్ళీ వారిని సహోధను పెళ్ళి చేసుకోవా లని సంకల్పించుకోవడమూ కేవలమూ అధర్మాలని నేను నిష్కర్షగా నిర్ణయిస్తున్నాను. తమరు దీనికి భిన్నంగా ప్రవర్తించకూడ దని విధిస్తున్నాను.

(చిట్టిపిరన్న కంగారుపడుతూ “మహాకవీ, మహాప్రభూ” అని ప్రాధేయపడుతూ యిద్దరినీ శాంతిపరచాలని చూస్తాడు ; కాని వారిలో వొక్కరూ అతన్ని గమనించరు)

రాజరాజు—(రోషంతో) ఇది ధర్మబాహ్యమైన నిర్ణయం. పదవికి మించిన ఆజ్ఞ. కనక నేను పూర్తిగా తిరస్కరిస్తున్నాను.

నన్నయభట్టు—(చెయ్యి జాడిస్తూ) అదీ మాట. తేలవలసిన పర్యవసానం అదీ. ఇంత ఘనీభవించిపోయిన తర్వాత అది నిగూఢంగా యెందు కుండిపోవాలీ? నిన్నటి దాకా ధర్మదేవతకు చళుక్యసామ్రాజ్యమే ఆటపట్టు. ఇవాళ అక్కడే అధర్మదేవతకు పాదప్రహారం జరిగింది. ఇది లజ్జావహమైన పరిణామం. తెలిశాక కూడా ముసుకు మూసుకుని కూచోడం అవివేకం. నిజంగా పువ్వు లమ్మిన వూళ్లో కట్టె లమ్మడం కంటే నికృష్టత యేమీ లేదు. తమరు మహాభారతం తమ పేర ఆంధ్రీకరించవలసిం దని సెలవిచ్చినప్పుడు, తమరు ధర్మపరాయణులుగా వుండడంవల్లనే అంగీకరించి నేనందుకు పూనుకున్నాను; కాని తమ ధనకనకవస్తువాహనాదులు కోరి కాదు. పాండవుల ధర్మేతిహాసం వారి సంతతివారి ప్రేరణవల్లనే ఆంధ్రీకరించబడడమూ, పూర్వపుణ్యావశంవల్ల, అది, నాకు, వ్యాసమహర్షి పదవి కలిగించడమూ—ఇదంతా తలుచుకుని నేను పులకాంగిపోయాను; కాని పంచమవేదాన్ని, వైదిక ధర్మాన్ని కాల రాసేసిన తమ పేరుగా రచించడం పూర్తిగా అనుచితమైన పని. ఇంకా ఆపని చేస్తే నాజన్మ కలుషితం అయిపోతుంది. కనక యింతటితో నే నది కట్టిపెట్టేస్తున్నాను. (గభీ మని లేచి) ఈవిధంగా నాపదవికి యిప్పుడే స్వస్తివాచనం అయిపోయింది; కనక యిదే నేను వెళ్లిపోతున్నాను. (చివాలున వెళ్లిపోతాడు)

(చిట్టిపేరన్నా, రాజూ వొక్క క్షణం నివ్వెరపోయి వుంటారు)

చిట్టిపేరన్న—మహాప్రభూ! అంతా విమమిస్తున్నది. తమ రిప్పటి కేనా మంచి దారికి రాకపోతే యింకా చాలా చిక్కు లున్నవి. సెల వయితే కాళ్ళా వేళ్ళా పడి భట్టారకులవారిని తీసుకువస్తాను. వారిని న్యూనత పరచడంవల్ల సర్వనాశం సంభవిస్తుంది. భారతరచన యిప్పు డరణ్యపర్వంలో వున్నది. అది ఆగిపోవడమే అపాయకరం. అందులోనూ అరణ్యపర్వంలో విఘాతం రావడం యెంతమాత్రమూ మంచిది కాదు. తమరు త్వరపడాలి. లేకపోతే—(అర్థోక్తి)

రాజరాజు—(తాపీగా వాగిస్తూ) కంగారుపడకండి. అంతటితో ఆగండి. మీ రేమీ భయపడనక్కర్లేదు. అంతా సవ్యంగా జరుగుతుంది. ఏదీ మిగిలిపోదు. దేనికీ విఘాతం కలగదు—(అర్థోక్తి)

చిట్టిపేరన్న—తమ విశ్వాసం యేమిటో నాకు బోధపడడం లేదు. తమ కీ ధైర్యం యెలా కలుగుతున్నదో నాకు అర్థం కావడం లేదు.

రాజరాజు—అంతా బోధపడుతుంది, కొంచెం ఓపిక పట్టండి. ఒకానొక ప్రాచీనసామ్రాజ్యానికి మూలాధారం అయిన మీ రే యిలాగ తేలిపోవడం ప్రశంసాపాత్రం కాదు. భట్టారకులవారు సన్న్యాసముఖ్యులే; కాని వారి కావేశం యెక్కువ. వారి దినచర్యల్లో క్షణక్షణమూ అది కనబడుతూనే వుంది. అది వారికి, కవిత్వంవల్ల సంక్రమించిన దోషం. పరిశీలించి చూడండి. కవిత్వమూ, ధార్మికత్వమూ వొకదాని కొకటి చుక్కెదురు. వాటి కెప్పుడూ పొత్తు కుదరదు. దురదృష్టవశంవల్ల భట్టారకులవారిదగ్గిర అవి రెండూ పరమావధి పొందినవి; కాని దురత్యయమైన వాటి వేగానికి వారు తాళుకోలేక పోయారు. అందుచేతనే వా రిప్పు డిలాగ మహోన్మాద ప్రదర్శనం చేశారు. పోనివ్వండి. మీ రేమీ బెంగ పెట్టుకోకండి.

చిట్టిపేరన్న—భట్టారకులవారిలో కవితావేశం వున్నదంటే నేనున్నూ అంగీకరిస్తాను. దానివల్లనే వారు తొందరపడ్డా రంటే కూడా నేను వప్పుకుంటాను; కాని వారు చేసిన ధర్మనిర్ణయం యెంతమాత్రమూ తప్పు దారి పట్టలేదు.

రాజరాజు—అది మీ కలాగే కనపడుతుంది. ఆవిషయంలో మీ రందరూ వొకటే అని నాకు బాగా తెలుసు. అయితే: భట్టారకులవారు కొద్ది రోజుల్లోనే తమ తప్పు తెలుసుకుంటారు. పశ్చాత్తప్తులున్నూ అవుతారు. మళ్లీ యథాపూర్వంగా తమ విధులున్నూ నిర్వర్తించుకుంటారు. కనక, మీరు, తొందరపడి, వారి పేరుగా జరుగుతున్న యేర్పాట్లలో యేమీ మార్పులు చెయ్యకండి.

చిట్టిపీరన్న—చిత్తం, నేను చెప్పవలసింది చెప్పక పోవడం ధర్మం కాదు. కనక విన్నవించుకుంటున్నాను. భట్టారకులవారు తమరు తలచినంత చలచిత్తులు కారు.

రాజరాజు—మీరు అలాగే అనుకుంటూ వుండండి. కొద్దిరోజుల్లో యీ భట్టారకులవారే నా నవవధువును ఆశీర్వదించి నన్ను ప్రశంసిస్తారు.

చిట్టిపీరన్న—(నిరాశ కనపరుస్తూ) ఇక తమ చిత్తం. నా కిప్పటికి సెల విప్పించండి.

రాజరాజు—వెళ్లిరండి.

చిట్టిపీరన్న—(లేచి) చిత్తం, సెలవు. (వెళ్లిపోతాడు)

రాజరాజు—(చిట్టిపీరన్న మీదటగివుంటాడన్నంత వరకూ గుమ్మంకేసి చూసి, తరవాత వెనక వున్న గది కేసి చూస్తూ) మహారుద్రయ్యగారూ!

(వెంటనే "చిత్తం మహాప్రభూ"! అంటూ మహారుద్రయ్య వచ్చి యెదట కూచుంటాడు)

రాజరాజు—(చిరునవ్వుతో) విన్నారా?

మహారుద్రయ్య—అంతా విన్నాను మహాప్రభూ! ఇదంతా పెద్ద కుట్ర. ఇందులో చిట్టిపీరన్నగారూ, తమ్మునుగారూ, భట్టారకులవారూ ముఖ్యులు.

రాజరాజు—ముఖ్యులైతే?......ఏం చెయ్యగలరూ?

మహారుద్రయ్య—అది తమలో వుంది. ఏలినవారు మహామేరువులాగ చలించకుండా వుంటే భట్టారకులవారు చేసిందే తతిమ్మావారున్నూ చేస్తారు. లేకపోతే మాత్రం వాకాట ఆడి చూపిస్తారు.

రాజరాజు—(నిరశంకిం చేస్తూ) చూపిస్తారు. (చురచుర చూస్తూ) చూపిస్తారేం? అదంతా కట్టిపెట్టండి. దయతలిచి వూరుకున్నాను గాని భట్టారకుల వారిప్పుడేమి చేస్తే యేమి చెయ్యగలరూ?

మహారుద్రయ్య—అది నిజమే. తమరు చాలా దూరం ఆలోచించారు. చాలా అనుగ్రహం చూపించారు. నిజానికింత మాత్రానికే తమరెందుకు తొందరపడాలీ? వీరందరూ మన గుప్పిట్లో వున్నారు. ఏక్షణంలో తలుచుకుంటే ఆక్షణంలోనే నొక్కివెయ్యవచ్చు. ఎక్కడికి పోగలరూ? తమ నిదానం అనితరదుర్లభంగా వున్నది. చాలా సంతోషం. నేనిందుకు కూడా చాలా సంతోషిస్తున్నాను.

రాజరాజు—ఏమిటదీ?

మహారుద్రయ్య—జక్కులదేవి మండలేశ్వరులు సంతోషిస్తూ అంగీకరించి సన్మానించారనీ, చిత్రాంగీదేవమ్మగారున్నూ త్రికరణయూ అంగీకరించారనీ తమరు సెల విప్పించారే గాని ఆ లేఖ వారికి చూపించలేదు. అది చాలా మంచిపని.

రాజరాజు—లేఖ చూపిస్తానూ? అగత్యం యేమిటీ? మనమాట వారు నమ్మవలసిందే. లేకపోతే వూరుకోవలసిందే. నమ్మకపోయినా వారు చెయ్యగలిగినది యేమీ లేనప్పుడు మనం యెందుకు చూపించాలీ?

మహారుద్రయ్య—అదీ సంగతి. నిజానికి జక్కులదేవి మండలేశ్వరు లంగీకరించారనే సంగతి కూడా మనం వారికి చెప్పవలసిన పని లేదు. ఇంతకీ: చిత్రాంగీదేవమ్మగారు కోరిన ఆరుమాసాల గడువు సంగతి యెవరికి తెలవకూడదు. నేను విన్నవించుకునేదదీ.

రాజరాజు—అవునవును. అది నాకు తెలుసు. అంచేత కూడా నేను వారికా లేఖ చూపించలేదు.

మహారుద్రయ్య—చిత్తం మహాప్రభూ! మరి నేను భోజనం చేసివస్తాను, సెల విప్పించండి. (లేస్తాడు)

రాజరాజు—(లేస్తూ) వెళ్లిరండి. ముఖ్యంగా భట్టారకులవారి విషయం మాత్రం లెస్సగా తెలుసుకుంటూ వుండండి.

మహారుద్రయ్య—చిత్తం చిత్తం. తలుచుకుంటే—(నవ్వి) తాము కవిత్వం కట్టిపెడితే ప్రపంచకం మునిగిపోతుం దనుకుంటున్నారు పాపం భట్టారకులవారు.

రాజరాజు—(నవ్వి) మరే. పిచ్చిబ్రాహ్మడు.

మహారుద్రయ్య—ఇంకొకటి చిత్తగించారా? భారత రచన అరణ్యపర్వంలో నిలిచిపోవడం శ్రేయస్కరం కాదన్నారు చిట్టిపీరన్నగారు. దానికి నేనున్నూ అంగీకరిస్తాను. అయితే, అందుకు భట్టారకులవారి ఉన్మాదమే హేతువు. ఏలినవారికి అందులో యేమీ ప్రసక్తి లేదు. భారతం పూర్తిగా ఆంధ్రీకరించవలసిందని తాము ఆదిలోనే

సెలవిప్పించారు. దానికి ఇప్పటికీ యెప్పటికీ కూడా తిరుగులేదు. కనక అలా నిలుపుచెయ్యడంవల్ల కలిగే అనిష్టప్రాప్తి భట్టారకులవారికే ఘటిస్తుంది. (నవ్వి) వారిని సమర్థించిన మన చిట్టివీరన్నగారికిన్నీ—(నవ్వుతాడు)

రాజరాజు—(నవ్వుతూ) అవునండీ. మీరు సరిగా చెప్పారు. అయితే: నాకు నిజంగా నూనేస్తారనేనా మీ వూహ?

మహారుద్రయ్య—అది వొట్టికల్ల. లెక్కపెదిరోజులు—తప్పితే—వొక్క నెల—తరవాత భట్టారకులవారు వచ్చి—అనకూడదు కాని—(తాను చేసి చూపిస్తూ) లెంపలు వాయించుకుని, పాదాక్రాంతులై—(అర్థోక్తి)

రాజరాజు—అదేలాగా తప్పదు.

మహారుద్రయ్య—మరి సెలవు.

రాజరాజు—వెళ్ళిరండి.

(మహారుద్రయ్య బయటికీ, రాజరాజు లోపలికీ బయలుదేరుతారు)

రాజరాజు—(గట్టిగా పిలిచి) మహారుద్రయ్యగారూ!

మహారుద్రయ్య—(ఆగి) ఏం సెలవు?

రాజరాజు—అంచెమిత్రాలు మూడు మురిచిపోకుండా?

మహారుద్రయ్య—(తల వూపుతూ) అవునవును. లేదు లేదు మహాప్రభూ! మరిచిపోలేదు. ఈకార్యం జరిగిపోయేదాకా అప్పటినించీ వాళ్ళకీ మనకీ నిముషానికొకసారి వుత్తరప్రత్యుత్తరాలు నడుస్తూ వుండాలి. తప్పకుండా రేపే ర్పాటు చేయిస్తాను మహాప్రభూ! ముందా యేర్పాటు చేసే తరవాత భోజనం చేస్తాను.

రాజరాజు—అలాగే తొందరపడండి.

మహారుద్రయ్య—చిత్తం, చిత్తం. అదంతా నేను చేయిస్తాను కాదూ? (ఇద్దరూ వెళ్ళిపోతారు)

శ్రీ నాళం కృష్ణారాయని రచనలు

ఉరుమళ్ల కామేశ్వరరావు బి. ఏ. బి. ఇడి.

శ్రీ నాళం కృష్ణారావుగారు ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ కవులు. వారి పద్యాలకోసమే "వాసవి" పత్రికను చందాదార్లు ఎదురు చూస్తూండేవారు. వారికి ప్రత్యేకంగా ఇష్టం లేక పోయినా అనేకమంది స్నేహితుల కోరికపై వారు వేరు వేరు పత్రికలలో అచ్చువేసిన ఖండకావ్యాలు చిన్నపుస్తకాలుగా ప్రకటించారు. ఇప్ప మొత్తం ౭ సంపుటాలు; మధురరస గుటికలు.

కృష్ణారావుగారు రాజమహేంద్రవరంలో పేరు ప్రసిద్ధిచెందిన నలుగురైదుగురు మహాకవులలోను ఒకరు. వీరికి ఆంధ్రదేశీయులు ఇచ్చిన మధురకవి బిరుదం సార్థకమైనదేగాని విపరీతార్థకం గాదు.

కృష్ణారావుగారు అనేక సొంత ఖండ కావ్యాలు కూడా రాశారు. వారిది పరార్థకవిత్వమే (Objective poetry) గాని ఆత్మీయ కవిత్వం (subaective poetry)గాదు. వారి సంపుటాలలో *ఉన్న 'సత్యకాముడు' 'శివశిల్పము' 'చిన్నపువ్వు' ఖండకావ్యాలు వారి స్వతంత్ర కవిత్వప్రౌఢిమకు నిదర్శనాలు. కాని వారి నిజమైన ప్రతిభ అనువాదాలలో ఉందని నాయొక్క వినయపూర్వకమైన విన్నపం. ఒక కావ్యాన్ని అనువదించడానికి కవికి భాషాసామగ్రి, కవిత్వమాధుర్యం, పరభాషాప్రవేశం, కవితోత్తేజం ఉండాలి. ఇన్ని అంశాలూ ఉన్నవారు తెలుగు దేశంలో ఎంతమంది ఉన్నారు? నేటి భావకవులలో గాని లేక ఇతరులలోగాని ఇన్ని సందర్భాలు ఉన్నవారు మరొక్కరైనా నాకు కనపడరు. మధురమైన రచనఉంటే తగినంత భాషాసామగ్రి లేకపోవచ్చునేమో, భాషఉంటే కవిత్వంలో సారస్యం లేకపోవచ్చునేమో, సారళ్యముంటే మాధుర్యం లేకపోవచ్చునేమో, పైగుణాలన్నీ ఉంటే పరభాష రాకపోవచ్చునేమో ఈ మోస్తరుగా ఉన్నవారేగాని అన్నిగుణాలు ఉన్నవారు తెలుగుదేశంలో శ్రీ నాళం కృష్ణారావుగారు తప్ప మరొకరు

---

* కృష్ణారావుగారి "పాలతరగలు" "తేనెచినుకులు" "దీపావళి" "మిరపంటే" అనే సంపుటాలు చదివి కామేశ్వరరావుగారు రివ్యూసం రాశారు. సంపాదకుడు

కనబడరు. కాబట్టి శ్రీ కృష్ణారావుగారు తెలుగు దేశానికి చెయ్యవలసిన మహోపకారం ఇది. గడిచిన రెండు శతాబ్దాలలోని ఆంగ్లమహాకవుల రచనలు నేటి ఆంధ్ర మహాకవులకి ఉత్తేజం, ఉద్దీపనం కలిగించాయి. ఈవిషయం విమర్శకులకి విదితం. నేటి ఆంధ్రమహాకవులకి ఈ పరోక్షగురుగా ఉద్దీపనం కలిగించిన ఆ ఆంగ్లరచనలు ఆంగ్లభాషరాని ఇతరులు ఎరగరు. వాటి మాధుర్యం చవిచూడడం వారికి అందరాని కోరిక. ఇటువంటి కోరికని సఫలం చెయ్యగలవారు శ్రీ నాళం కృష్ణారావుగారు ఒక్కరే. వీరు ఆంగ్లమహాకవుల ముఖ్యమైన ఖండకావ్యాలు తెలుగులోకి తెచ్చి ఆంధ్రదేశానికి శాశ్వతమైన ఉపకారం చెయ్యవలసిందని నా ప్రేమపూర్వకమైన విన్నపం. ఆంధ్రకవులు ఈవిషయమై వీరికి తగినంత ప్రోత్సాహమిచ్చి వీరివల్ల ఈ అసాధ్య సాధ్యమైన పనిని నెరవేర్చుకొందురు గాక!

శ్రీ కృష్ణారావుగారు ప్రకటించిన పుస్తకాలు బాల బాలికలకి పఠనార్హమైనవిగా ఉన్నాయి. విద్యాశాలాంతర్గతులు వారికి కూడా పఠనీయమైనవిగా ఉన్నాయి. టెక్స్టు బుక్కు కమిటీవారు, ఎకాడమీ వారు కూడా వీరిని ప్రోత్సహించి విద్యార్థులను రసాభిమానులుగా చెయ్యవలసింది!

కృష్ణారావుగారి కవిత్వ శక్తిని గురించి ఒక్కమాట చెప్తాను. గీత పద్యరచనలో అత్యంత మాధుర్యం కనబరచినవాడు శ్రీనాథమహాకవి. ఆమాధుర్యమే శ్రీ కృష్ణారావుగారి పద్యాలలో అవతరించింది. వీరికి గీత పద్యమంటే ప్రీతి. ఆధునికాంధ్ర భారతికి వీరిగీతములు అపూర్వాలంకారం.

శ్రీ నాళం కృష్ణారావుగారిని తెలుగు కవులు ప్రోత్సహించి ఇతరులకి అసాధ్యమైన ఆంగ్లకావ్యానువాదాన్ని చేయించుకొని శాశ్వతానందం పొందుదురు గాక!

రివ్యూకోసం పుస్తకాలు

ప్రబుద్ధాంధ్రకు, రివ్యూనిమిత్తం పుస్తకాలు పంపేవారు రెండేసి ప్రతులు_ఒకటి రివ్యూ చేసేవారి నిమిత్తమూ, మరొకటి పత్రికా భాండాగారం నిమిత్తమూ పంపాలి. ఒక్క ప్రతే వచ్చే పుస్తకాలు రివ్యూ చెయ్యబడవు. రివ్యూలు నిపుణులచేతనే రాయిస్తాము. కాని యిలాంటి పరిస్థితులలోనూ వాటిమీద జవాబులూ, పునర్విమర్శలూ ప్రకటించము. ప్రబుద్ధాంధ్ర—సంపాదకుడు

వ్యాఖ్యానములు

విశ్వనాథంగారు దీని కేం చెబుతారూ ?

విశాఖపట్నం, నరిసీపట్నం నియోజకవర్గాలకు సంబంధించిన కాంగ్రెస్సు ఎం. ఎల్. ఏలు, అనకాపల్లి పంచదార ఫాక్టరీలో సారా తయారు చెయ్యడానికి లైసెన్సు కోరా రనీ, అందుకు "పవిత్ర" కాంగ్రెస్సుమంత్రులనుమతించా రనీ, విశాఖపట్నం జిల్లాలో వొక గొడవ బయలుదేరింది.

ఈసందర్భంలో మామిత్రులు, తెన్నేటి విశ్వనాథంగారు ఒక ప్రకటన చేశారు.

విశ్వనాథంగారు విశాఖపట్నంలో గొప్ప విద్యాధికులలో వొకరు. మరీన్ని వారు న్యాయవాదులు. సంపన్నులు. జిల్లా అంతటికీ పేరుప్రతిష్ఠలు నిలుపుతున్న త్యాగధను లైన యువకులు.

వారు, ప్రస్తుతం మన రెవెన్యూమంత్రి ప్రకాశంగారికి కార్యదర్శి అయి వున్నారు.

అయితే: ఒకానొక బాదరాయణసంబంధంవల్ల, ఆ సారాతో, వారికిన్నీ, వోపట్టాన తెగిపోని లంకె యేర్పడింది.

అంచేతనే వారా ప్రకటన చెయ్యవలసివచ్చినట్టుంది.

తమ ప్రకటనలో వా రిలా అంటున్నారు.

"అనకాపల్లి పంచదారఫ్యాక్టరీకి ఆంధ్రా ఇంజనీరింగు కంపెనీవారు మేనేజింగు ఏజంట్లుగా నున్నారు. సదరు ఆంధ్రాఇంజనీరింగు కంపెనీలో నేనొక డైరక్టరుగా నున్నాను. దానికి డి. యల్. నరసింహరాజు (యం. యల్. ఏ) గారు మేనేజింగు డైరక్టరుగా నున్నారు. అనకాపల్లి చక్కెరఫ్యాక్టరీ వ్యవహారములను ఆంధ్రా ఇంజనీరింగు కంపెనీవారు నిర్ణయించుచుందురు. ఈ ఆంధ్రా ఇంజనీరింగుకంపెనీలో నేనొక డైరక్టరుగా నుండినప్పటికిని, ఇంతవరకును ఆకంపెనీ డైరక్టర్ల మీటింగులలో దేనికిని నేను హాజరై యుండలేదు. కనుక, సదరు లైసెన్సు దరఖాస్తు విషయములో నా కెట్టి ప్రసక్తి, ప్రమేయము లేదని గ్రహింపవలెను"

తమ సంగతి యింత స్పష్టంగా వివరించినందుకు మేము విశ్వనాథంగారిని చాలా ప్రశంసిస్తున్నాము ; కాని నిజం చెప్పవలసివస్తే యీ వాక్యాలవల్ల వారు కృతకృత్యులు కాలేదు.

ఈ విషయం, యీ వ్యాఖ్యానం చివరి దాసంతిట అదే విశదపడుతుంది. మరి ప్రకృతం యేమి టంటే ? వారి ధోరణి, ప్రకటన అంతటా వొక టే విధంగా లేదు. సంగతి సందర్భాలు చూడగా, వారు, యీగొడవ బయలు దేరినందుకు చాలా వుద్రిక్తు లయిపోయినట్టు కనిపిస్తున్నది. ఇందుకు నిదర్శనంగా, వారు,

"డి. యల్. నరసింహరాజుగారు విశాఖపట్నంజిల్లాలో చిరకాలమునుండియు కాంగ్రెసుసేనకులై పనిచేసియుండిరి. వారిపై నెవమెన్ను వారికంటెను కూడ వారెక్కువ కాంగ్రెస్సుసేవ చేసి రని చెప్పగలను"

అంటున్నారు.

ఈ వాక్యాలు విశ్వనాథం గారి దోషాన్ని మరింత ఘనీభవింపచేస్తున్నవి. ఏమంటే ? రాజుగారు కాంగ్రెస్సు సేవ చెయ్యలేదని యెవరూ ఆక్షేపించడం లేదు. ఇటు కాంగ్రెస్సువాదులు కావడమూ, అటు సారాబట్టీలు నిర్వహించడమూ—ఇదీ యిక్కడ వున్న పుట్టిమునక. విశ్వనాథంగారు, రాజుగారిలో, ఏవిశేషం వుందని ఘోషిస్తున్నారో అదే వారిని గిరగిర తిప్పి కొడుతున్నది. కాంగ్రెస్సు సేవ చెయ్యడంలో, రాజుగారు, నెవమెన్న వారికంటెను అధికులై వుంటే, కాంగ్రెస్సుధర్మాలను ఆచరించడంలో కూడా అధికులై వుండవద్దూ ? అసలు, కాంగ్రెస్సుధర్మాలను సరిగా బోధపరుచుకుని ఆచరణలో పెట్టడమే కాదూ కాంగ్రెస్సుసేవ అంటేనూ ? రాజుగారి అధికతరకాంగ్రెస్సుసేవ, వారికి, సారాబట్టీలు

నిర్వహించడానికి అధికతర యోగ్యత కలిగిస్తుం దంటారా విశ్వనాథంగారు ?

విశ్వనాథంగారు ఇంతటితో వూరుకోడం లేదు. సారా బట్టీలు నిర్వహించడానికి లైసెన్సు అడిగి, పొందివున్న రాజాగారిని సమర్థించడానికిన్నీ, నిషేమన్న వారిని పడ గొట్టడానికిన్నీ వారింకా యిలా అంటున్నారు.

"అట్టి నరసింహరాజుగారు సారాబట్టీల లైసెన్సుకు దరఖాస్తు చేసియుండిన యెడల అందుకు తగిన ప్రబల కారణము లుండగలవు. మద్యపాననిషేధమునకై దీక్ష వహించిన మంత్రివర్గము వారు అట్టి లైసెన్సును జారీచేసిన యెడల అందుకు తగిన కారణములు కూడా ఉండగలవు"

ఇది తర్కమే అనుకోవాలా? అయితే, మరి దేనికి కారణా లుండవో విశ్వనాథంగారు సెలవిస్తారా ? నిన్నటి దాకా, కాంగ్రెస్సు, కల్లుపాకలదగ్గిర యువతులచేత కూడా పికెటింగు చేయించింది. దానికీ కారణా లున్నవి. కాంగ్రెస్సుప్రముఖు లందరూ యిప్పటికిన్నీ మద్య నిషేధం చాలా అవసరం అంటున్నారు. దానికీ కారణా లున్నవి. ఇక్కడ, అనకాపల్లిలో, ఆ కాంగ్రెస్సుకు సంబంధించిన ఎం. ఎల్. ఏలు సారాబట్టీలు నిర్వహించ డానికి లైసెన్సు పుచ్చుకున్నారు. దీనికీ కారణా లున్నవి. కాంగ్రెస్సుమంత్రులు సేలంజిల్లా అంతటా మద్యనిషేధం అమలులో పెట్టారు. దానికీ కారణా లున్నవి. మళ్లీ ఆమంత్రులే విశాఖపట్టణంజిల్లాలో కాంగ్రెస్సు ఎం. ఎల్. ఏలకే సారాబట్టీలకు లైసెన్సు ఇచ్చారు. దానికీ కారణా లున్నవి. విశ్వనాథంగారు "కాని యీ కార ణము లెవ్వియో నాకు తెలియవు" అంటున్నారు. దీనికి మాత్రం కారణాలు లేకపోతా యని మే మెలా అను కుంటామూ ?

నిజంగా కాంగ్రెస్సుసిద్ధాంతాల అంతరార్థం అంతా విప్పిచెప్పారు విశ్వనాథంగారు.

కాంగ్రెస్సుమహాసంస్థకు నాలుగువేపులా దుర్భేద్యాలైన రాతిగోడలే. ఆగోడలలో ఎక్కడ చూసినా దిడ్డి గంతలే. ఆదిడ్డిగంత లన్నీ యెప్పుడూ కాంగ్రెస్సుసభ్యులతో కిటకిటలాడుతూ వుండడమే.

చాలా బాగుంది.

ఇంతా అయినాక, విశ్వనాథంగారిలా అన్నారు.

"కాని నావిషయమై దురభిప్రాయముల పాలగు చున్నవారిని శాంతింపజేయుటకై యీ ఆంధ్రా యింజనీరింగుకంపెనీలోని నాడైరక్టరుపదవికి రాజీనామా నిచ్చుటకు నాకెట్టి సంకోచమును లేదు. కనుక, ఆంధ్రా యింజనీరింగుకంపెనీలోని నా డైరక్టరు హోదాకు నేను రాజీనామా నిచ్చితిని"

"ఇచ్చితిని" అని ఖండితంగా భూతకాలక్రియనే వాడినప్పుడు, విశ్వనాథంగారి విషయంలో, యిక యెవ్వరూ అనుమానపడవలసిం దేమీ లేదు ; కాని యీ తంతంతా యెందుకూ ? "నిషేమన్నవారు" ఇంత టితో తృప్తిపడతా రేమో మాకు తెలవదు. పోగా, ఇక లోకం మాత్రం గుడ్డిది కాదని విశ్వనాథంగారు గ్రహించవలసివున్నది.

ఉన్నదల్లా యేమి టంటే ? విశ్వనాథంగారు ఆంధ్రా ఇంజనీరింగు కంపెనీలో వొక పెద్ద భాగస్వాములు. కన కనే, వారు, ఆకంపెనీ డైరక్టర్లలో వొకరు కాగలిగారు. ఆకంపెనీ వ్యవహారాలు చాలా చక్కగా నడుస్తున్నట్లు న్నవి. అనుమానాలకు ఎడమిచ్చే కార్యక్రమమూ, పేచీలు పురికొల్పే సన్నివేశాలూ ఆకంపెనీలో లేనట్టు న్నది. అంచేతనే తా మొక డైరక్టరు అయి వుండిన్నీ విశ్వనాథంగారు డైరక్టర్ల మీటింగులకు హాజరుకావడం మానుకున్నారు ; గాని డైరక్టరుగా వుండడమూ, భాగ స్వాములుగా వుండడమూ యిష్టం లేక కాదు. అనకా పల్లి చక్కెరఫాక్టరీవ్యవహారాలు మానేజి చేసి, సారా బట్టీలు నిర్వహించడంవల్ల ఆంధ్రాఇంజనీరింగు కంపెనీకి మంచి లాభం వస్తుంది. వాటాదారులు కావడంవల్ల, విశ్వనాథంగారికి, దాల్లో సాధ్యమైనంత పెద్ద మొత్తం యెలాగా ముట్టుతుంది. డైరక్టరు పదవి పోవడంవల్ల దానికి కలిగే విఘాతం యేమీ లేదు.

అవునా కాదా ?

నటన తప్ప ఇందులో—సారాయెడల విశ్వనాథంగారు చూపించిన యేవగింపు ఏమి వున్నదీ ? వారు తమ తప్పు

దిద్దుకున్న దేదీ? ప్రజాభిప్రాయం యెడల వారు చూపించిన నమ్రత యేదీ? వారిప్పుడేమి త్యాగం చేసినట్లూ?

ఇది యిలా వుండగా;

కాంగ్రెస్సు ఎం. ఎల్. ఏ. నరసింహారాజుగారి మాట యేమిటి? అర్థంలేని తమ డైరక్టరుపదవీత్యాగంవల్ల, తాము పూనుకు వచ్చిన రాజుమీద యెంత భారం పడిందో విశ్వనాథం గారేమేనా ఆలోచించారా?

ఈ కాంగ్రెస్సుసారా విషయం, విశాఖపట్నం కాంగ్రెస్సు, విశాఖపట్నం జిల్లాకాంగ్రెస్సు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్సు, అఖలభారతకాంగ్రెస్సు, కమిటీలదాకా వెళ్లినట్టు కనపడుతున్నది. విశ్వనాథంగారి స్టేటుమెంటు కూడా వెళ్లిందా? అక్కడక్కడ అయినా కాంగ్రెస్సు శీలశైథిల్యం కనపడుతుందా?

వీరా ఆంధ్రరాష్ట్రం తెస్తారు ?

బొంబాయి గవర్నరు సర్. రోజరు లమ్లీగారు, పని మీద బెల్గాము పట్టణం సందర్శించినపుడు, కర్ణాటకులు, వారిని, తమ కన్నడజిల్లాలు ప్రత్యేకించి వొక రాష్ట్రం నిర్మించేటట్టు ప్రయత్నాలు సాగించవలసిం దని కోరారు.

కన్నడుల దురాశ నెరవేరి, బళ్ళారి జిల్లా అంతా కన్నడరాష్ట్రంలో చేరితే ఆరాష్ట్రంలో మొత్తం, యేడు జిల్లాలు మాత్రమే వుంటవి. బళ్లారి ఆంధ్రులను కూడా బలవంతాన కలుపుకుంటే జనసంఖ్య ౬౫ లక్షలు మాత్రమే అవుతుంది. ఆంధ్రరాష్ట్రానికి చెందవలసిన ఆదాయంలో కొంత కొట్టుకుపోయినా నికరాదాయం మూడు కోట్లకు మించదు.

కన్నడుల యేకైకనాయకులు గంగాధరరావు దేశపాండ్యాగారిచ్చిన అంకెలివి.

దీన్ని బట్టి చూస్తే, కన్నడరాష్ట్రం, వోఢ్రరాష్ట్రం కంటేనూ నెలతక్కువ బిడ్డ అయి వుంటుంది. నిజంగా, సుమారు రెండుకోట్ల జనసంఖ్యా, పన్నెండు జిల్లాల వైశాల్యమూ, సుమారు పది కోట్ల నికరాదాయమూ వుండే ఆంధ్రరాష్ట్రం ముందు యీ కన్నడరాష్ట్రం యేపాటిదీ?

అయినా కన్నడులు తమకు ప్రత్యేకరాష్ట్రం కావాలని నిశ్చయించుకున్నారు. "కర్ణాటకులు అన్నివిధముల సంపూర్ణ మగు వికాసమును పొందుటకు ప్రత్యేకకర్ణాటకరాష్ట్రము నేర్పరిచిననే గాని తగిన అవకాశము లన్నియు లభించవు" అని వారి వాదం.

ఇందులో కావలసినంత సత్యం వున్నది; కాని లమ్లీగారు "ఇది మంచిది కాదు. దీనివల్ల ఖర్చులు ఎక్కువ అయిపోతవి. కర్ణాటకానికి న్యాయం జరగా లంటే శాసనసభలో కన్నడసభ్యు లింకా శ్రద్ధగా పని చెయ్యవలసి వుంటుంది" అని నిరుత్సాహం కలిగేటట్టు జవాబు చెప్పారు.

నిజానికి, లమ్లీగారిని సమర్థించా లనే ఘానుకున్నా యిది యెంత మాత్రమూ నిలవదు. ఏమంటే? బొంబాయిరాజధానిలో నాలుగే కన్నడజిల్లా లున్నవి. మద్రాసులో మూడైనా పూర్తిగా లేవు. ఇక వారి శాసనసభ్యు లెంత శ్రద్ధపడితే మాత్రం యేమి లాభమూ? ఇక్కడా అక్కడా కూడా వారెప్పుడూ మైనారిటీలోనే వుంటారు. ఒకరికి కన్నడులు లొంగి వుండవలసిందే గాని, కన్నడులకు లొంగివుండవలసిన దౌర్భాగ్యం యెవరికీ లేదు.

అందుచేత లమ్లీగారి జవాబు కన్నడులకు కావలసినంత రోషం కలిగించింది. వెంటనే వారి నాయకులైన దేశపాండ్యాగా రందుకుని "ఇట్టి ముఖ్యవిషయమును గూర్చి గవర్నరువంటి ముఖ్యాధికారి యిట్లు తెలుపుటవలన ప్రజలకు చాల ఆశాభంగము కలిగినది. గవర్నరుకు సానుభూతియును, గ్రహణశక్తియును లేశ మయినను లేవని విదిత మయినది. సర్. లమ్లీగారిటీవలనే గవర్నరుపదవి స్వీకరించినందున సంగతిసందర్భములు సరిగా తెలిసియుండవు; కావుననే యిట్లనియుందురు" అని గవర్నరుగారి యెడల కన్నడుల రోషమూ, అసమ్మతీ తీవ్రమైన ధోరణిలో ప్రకటించారు.

దేశపాండ్యాగారు కన్నడుల యేకైకనాయకు లని పైని చెప్పి వున్నాము. పైగా, వారు, గాంధిగారి అంతరంగికులలో ప్రధానులు. కాంగ్రెస్సుపక్షానికి చెందిన

వారు. గాంధిగారి అధ్యక్షతకింద బెల్గాములో జరిగిన కాంగ్రెస్సుకు వారే ఆహ్వానసంఘాధ్యక్షులు.

అయినా వారు కన్నడరాష్ట్రంకోసం తహతహపడుతున్నారు. తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. వ్యతిరేకం చెప్పినవారిని నిర్మొగమాటంగా యెదురుకుంటున్నారు.

మనమూ ప్రత్యేకాంధ్రరాష్ట్రం కోరుతున్నాము. కాని, యేదీ, మన కిలాంటి నాయకు డేడీ?

స్వరాజ్యం విషయంలో కాంగ్రెస్సు కూడా సరిగా కళ్లు తెరవకపూర్వమే మనము ఆంధ్రరాష్ట్రం కావాలని నిశ్చయించుకున్నాము. అసలు, భారతవర్షంలో భాషైకరాష్ట్రాందోళనకు మనమే నాందీకల్పన చేశాము. మనల్ని చూసే తతిమ్మావారు ప్రత్యేకరాష్ట్రాలు కోరుతున్నారు. మనము నేర్పిన పాఠాన్ని పట్టే సైంధవులూ వోఢ్రులూ అప్పుడే రాష్ట్రాలే సంపాదించుకున్నారు. కాని మనం?

ఆంధ్రోద్యమంవల్లనే పైకి వచ్చిన మన ప్రముఖులు కాంగ్రెస్సువూబిలో దిగబడిపోయారు. పూర్తిగా భావదాస్యం వారి నలుముకున్నది. కాంగ్రెస్సునిలయంలో భృత్యులుగా వుండడమే మనవారికి సర్వమూగా కనబడుతున్నది. ఆంధ్రరాష్ట్రం పర్వరచవలసిం దని దొరతనం వారిని కోరడం, మనవారికి నామోషీ అని తోస్తున్నది.

అంచేతనే మనవారు, మొన్న రాజప్రతినిధిగారు వచ్చి మద్రాసులో వారంరోజు లుండినా వారికి ఈవిషయం విన్నవించుకోలేకపోయారు. పనికిమాలిన కాంగ్రెస్సు శిక్షణ వారి కాళ్లకు బంధాలు వేసినది.

బొంబాయి ప్రధానమంత్రి ఖేరుగారు కన్నడరాష్ట్ర నిర్మాణానికీ, ఇక్కడి ప్రధానమంత్రి గాంధిగారి వియ్యంకులు ఆంధ్రరాష్ట్రనిర్మాణానికీ ప్రతికూలు రని జగత్తంతా తెలిసిన విషయం. ఇటీవల వారిద్దరూ బొంబాయిలో సమావేశం అయి కూడబలుక్కుని వుండడమూ, మొన్నమొన్ననే పటేలుగారు మద్రాసువచ్చి ప్రధానమంత్రికి ఏమిటేమిటో సలహాలు చెప్పి పోవడమూ విశ్వవిదితాలే. అయినా మనవా రింకా కళ్లు తెరవడం లేదు.

ఆంధ్రమహాసభ స్థాయిసంఘం వున్నదో వూడిందో యేమీ చడీచప్పుడూ లేదు.

ఆంధ్రమహాసభకు కాంగ్రెసుమసి పూసి దాని ప్రత్యేకతను కలుషితం చేసిన మన పట్టాభిసీతారామయ్యగారు ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెసుసంఘాధ్యక్షతలోసంపూర్ణస్వరాజ్యఫలితా లనుభవిస్తూ సర్వమూ మరిచి వున్నారు.

దొరతనంవారిని కోరకుండా, వారి ప్రధానోద్యోగులతో మంతనాలు జరపకుండా యీకాంగ్రెసుముగ్ధు లెప్పటి కైనా ఆంధ్రరాష్ట్రం సాధించగలరా?

మనవారు వెళ్లి కోరివుంటే, లష్లీగారు కన్నడులకు చెప్పినట్లే రాజప్రతినిధిగారున్నూ మనకూ చెప్పివుందు రనుకుందాం. దానివల్ల కన్నడులకు పట్టుదల కలిగినట్లే మనకున్నూ కలిగివుండును. "రాయబారం వచ్చిన యీప్రముఖులే కోరుతున్నారా యీప్రత్యేకరాష్ట్రం, ప్రజలు కూడా కోరుతున్నారా?" అని తెలుసుకోడానికయినా అధికారు లలా చెప్పడం సంభవించి వుండవచ్చును. అది ప్రజలలో ఆవేశం కలగడానికి హేతువయి నాయకులకు పని సుగమం చెయ్యదూ? ప్రజల ఆందోళన యిలాంటి పనులకు చాలా అవసరం కాదూ? మన యింటికి వచ్చినప్పుడే రాజప్రతినిధిగారిని కదపలేకపోయిన మన ఆంధ్రమహాసభానాయకులు అందుకోసం ఢిల్లీ వెళ్లడం సంభవిస్తుందా?

కాలహరణం తప్ప, నిజంగా, యీకాంగ్రెసాంధ్రుల వల్ల యేమీ కాదు. మేధావంతులే కావచ్చు గాని, వారికి, రాజ్యతంత్రపరిజ్ఞానం లేశమున్నూ లేదు. దొరతనం యెలా ప్రవర్తిస్తున్నదో, యెక్కడ, యెప్పుడు, యేమి యెత్తులు వెయ్యాలో వారికి సుతరామూ తెలవదు. గుజరాతీల వెనకా, హిందూస్థానీల వెనకా పడి ఆయాసపడడానికి తప్ప మనవారికి స్వయంనిర్ణయశక్తి యేమీ లేదు.

నిజంగా, వీరా, ఆంధ్రరాష్ట్రం తెస్తారు?

అది మన తాతగారి సొత్తు *

"మద్రాసు మాట యేమిటీ?" అని మేము మళ్లీ అడుగుతున్నాము.

ఎప్పటి కేనా ఆంధ్రరాష్ట్రం అంటూ వచ్చి, అప్పుడు, బాధ్యత గలవారు, రాజధాని "మేరు (ఇంద్రకీల) పర్వతశిఖరం" మీదనే వుండా లని పట్టుపడితే అందుకు మే మడ్డుచెప్పము. మరిన్ని, యీపరగణా నాలుగు రాష్ట్రాలుగా విడిపోయి, మద్రాసు ఎవరికీ రాజధానిగా వుండని సన్నివేశాలు తటస్థపడితే అందుకు, మాకు, విచారం కూడా వుండదు; కాని యిప్పుడు మద్రాసును ద్వేషించడం అర్థం లేని పని. దానిమాట యెంత మాత్రమూ తలపెట్టగూడ దనడం దూరాలోచన లేని మాట.

ఇప్పటికే మనం అంధులం అనిపించుకుంటున్నాము. ఆదిలో మైనారిటీలో వున్న అరవలు మద్రాసు ఆక్రమించేస్తూ వుంటే మనం తెల్లపోయి చూస్తూ వూరుకుని పూర్తిగా మైనారిటీలో పడిపోయాము. దీనివల్ల మనకిప్పుడు సరిహద్దు దగ్గిర గడ్డుపరిస్థితు లేర్పడడమే కాదు, దొరతనంలో మనకు స్థానం కూడా లేకుండా పోయింది.

ఇది యిలా వుండగా:

రాష్ట్రం ముందా, నగరనిర్ణయం ముందా? వివేకం వున్నచోట యిది అడ్డుతగలవలసిన సమస్య కాదు; కాని దౌర్భాగ్యవశంవల్ల, మనం, యిప్పుడు, నగరం కోసం కొట్లాడుకుంటూ రాష్ట్రం అక్కర్లేదనే స్థితిలో వున్నాము. నిజానికి, బెజవాడ విషయంలో యిప్పటికీ యెవరికీ పేచీ లేదు. అయితే: యునివర్సిటీ కార్యస్థానం బెజవాడనుంచి యెందుకు వెళ్లిపోయిందీ? దాన్ని మళ్లీ బెజవాడ తీసుకురావా లని దేశంలో దృఢసంకల్పం యేమీ కనపడ్డం లేదేమీ? ఈతప్పు దిద్దుకోగలిగితే మనకు అర్థం లేని శ్రీబాగుఒడంబడిక పుట్టడానికి కారణా లేవి?

ఉన్న పుట్టిమునక అంతా యేమి టంటే?

మనలో నాయకులుగా చెలామణి అవుతున్నవారంతా భావదాస్యంలో మగ్గిపోతున్నారు. తమ ఆంధ్రత్వమే వారికి భూతంలా కనపడుతున్నది. దృష్టి అంతా

* మద్రాసునగరవ్యామోహము. అయ్యా మీ క్రిందటి సంచికలో వి. యస్. శాస్త్రిగారి లేఖమీద మీరు గావించిన అభిప్రాయవిమర్శనను చదివి చాలా సంతోషించితిని. మీవంటి ఆంధ్రోద్యమాభిమానులు నిష్కల్మషము గా సమునికత్తువలె తీవ్రముగా అభిప్రాయములను ప్రకాశనం పొందకయుమున తెలుసుకొనగలవారు ఆంధ్రదేశములో యిదివరకు లేరనుకొంటిని. మీపత్రిక చూచిన తరువాత కొంత మనశ్శాంతికలిగి అవలి తిరిగి బయల్వెడలుచున్నవి.

కాని మీరు యితరుల శుష్కవాదములను పారదోలుచు ఒక్కవిషయములో మాత్రము అందరితో సమానము గా నిష్ఫలసంధను త్రొక్కరని నాబుద్ధికి తోచుటచే తిరిగి మీనూతనవిమర్శనకు తావొసంగుటకు విచారించుచున్నాను.

మద్రాసునగరమును మనమే ముట్టడివేసి తెలుగుప్రాబల్యము నే, అచ్చట నెలకొల్పి కార్యసాధన గావించు అవసర మని మీరు వ్రాసితిరి. ఆమద్రాసునగరసుందరి మీవంటి మేధావంతులను గూడ మోహపాశమున పడవేసిన దని నాఅభిప్రాయము. చెన్నపట్టణము యెంత భాగ్యవంతమైన నేమి ఎంతమంది ఆంధ్రనాయకులు అచ్చటకు వలసపోయిన నేమి ఎన్ని ఆంధ్రపత్రికలు అచ్చట ప్రచురింపబడుచుండిన నేమి ఆంధ్రుల ధనము ఎంతేని అచ్చట వ్యయపరుపబడిన నేమి అనేకీలలామము ఎప్పటికైనను నూతనాంధ్రసృష్టిలో మనకన్నతల్లి రూపమును ప్రదర్శించగలదా? ఏరోజునయితే ఆంధ్రులు అరవలు విడివిడిగా రాష్ట్రమాపలకు కోరిరో, అనాడే మద్రాసునగరము కృత్రిమ స్త్రీగా పరిగణింపబడవలయు ననుకొనుడు. అచ్చటి శక్తియుటమిదియే స్థానభ్రష్టమై అచ్చటి కళాకాంతులు భావిహీనపదగతమై లీనచ్ఛవముకలన నే జూచి నగు ననుకొనుడు. ఆంధ్రరాష్ట్రసృష్టి ఆంధ్రదేశవాతావరణమధ్యమున ఏమేరుపర్వతశిఖరమునకో అదృష్టదేవి క్రమరలపలెను గాని యింకా ఒకమారుమూల నున్న, భోగముపడుచుమాపులతో జాతిభేదముల పురికొల్పుచున్న మద్రాసునగరసుందరి పై పునకా! మన ఆత్మశక్తితో గాని రాష్ట్రము లభింప దని మీకు స్పష్టమైనప్పుడు యింకను చెన్నపట్టణమును ఆంధ్రులతో బలపరుచుడు అని మీరు హెచ్చరించుట హాస్యాస్పదము కాదా! మద్రాసును, పక్కనదే చాలని విడాపులతో మరచిపోవలసిన సమయములో మీరు కూడ అట్లు తలపెట్టుట నాకు వింతగా నున్నది. ఆమద్రాసునగరవ్యామోహము తగ్గనంతవరకు రాష్ట్రశక్తి కూడలి ప్రత్యేక కాంతులతో నిర్మింపబడజాలదు అని ముమ్మాటికి నాఅభిప్రాయము. ఇట్లు వ్రాసినవని క్షమించెదరు గాక.

పంద్రంగి కేశవరావు

వారికి గుజరాతీల పాదాలమీదా, హిందూస్థానీల పాదాలమీదా ముసురుకుంటున్నది. బుద్ధి అంతా వారి అనుగ్రహం తప్పిపోకుండా వుండేటట్టు చూసుకోడంలోనే కలుషితం అయిపోతున్నది. ఆత్మీయవ్యవహారాలు సవరించుకోవాలనే జ్ఞానమైనా వారికి లేదు. అలా అని వారు సొంత వ్యవహారాలను విడిచిపెట్టి వూరుకోరు. దీని వల్ల, వారు, పరిస్థితులేమీ అర్థం కాక సకలమూ ధ్వంసం చేస్తున్నారు. పులిమీద పుట్ర అన్నట్టు దీనికి తోడు మనకు అరవల ప్రాతికూల్యం వొకటి వచ్చి పడింది. ఈస్థితిలో మనం మద్రాసు విడిచిపెడితే, అటు రమారమి చెంగల్పట్టు దాకానూ, ఇటు హోసూరు దాటి కొంచెం అటోయిటో సేలం దాకానూ వికసించవలసిన ఆంధ్రరాష్ట్రం, ఇటు నాయుడుపేట యివతలికీ, అటు తిరపతి యివతలికీ ముడుచుకు పోదూ? మనం, మద్రాసులో యెదురుకుని పోటీపడుతూ వుంటేనే వొరతనమే కాక, ఆంధ్రమండలాలన్నీ కమ్మేస్తూ వున్న అరవలు, మద్రాసు విడిచిపెట్టి వస్తే యిక హావిష్యం భవిష్యం వుంచుతారా?

బెజవాడ ఆంధ్రరాష్ట్రానికి రాజధాని అయితే; కాకతీయసీమ (నైజాము) లో వున్న డెబ్బయిలక్షల ఆంధ్రులకూ నవశక్తి అంకురించడం నిజమే. అది మనకి చాలా అగత్యమైనదే; కాని మద్రాసు అరవల రాజధాని కావడంవస్తే, మన రాజధాని బెజవాడలో కూడా అరవలే మెజారిటీలో వుంటారు. బెజవాడ పాఠశాలలలో తెనుగు ఎగిరిపోయి అరవం పీటపెట్టుక్కూచుంటుంది.

ఇది చూడరాదూ? నాలుగు భాషల కూడలి అయిన నైజామురాజ్యంలో సగానికి పైగా మన ఆంధ్రులే వున్నారు. దాని రాజధాని అయిన హైదరాబాదు తెనుగుజిల్లాల మధ్యనే వుంది. రాజ్యంలో వున్న జాగీరుదార్లలో గొప్పవారూ ఎక్కువమందీ తెనుగువారే అయి వున్నారు; కాని యేమి లాభం? మన వాళ్లకి అక్కడ యేమీ పలుకుబడి లేదు. మనకంటే బాగా తక్కువ వున్న మహారాష్ట్రులపనీ బాగానే వుంది. వారికంటే చాలా తక్కువగా వున్న కన్నడుల పనీ లోటుగా లేదు. అంతకంటె లొచ్చుగా వున్న మాహమ్మదీయులు—సరేసరి పాలకజాతి కావడంవల్ల వారి సంగతి చెప్పనే అక్కర్లేదు. అయినా యిందరిన్నీ కాదని, యెక్కణ్ణుంచో వచ్చి, అరవలు, అక్కడ, ప్రముఖులై కర్ణధారులై వున్నారు.

ఇంతెందుకూ?

బెజవాడలో, యిప్పుడు, లీడింగువకీళ్లయినా ఆంధ్రులు కారే?

మద్రాసంటే మేము వ్యామోహపడిపోతున్నామని యెగతాళి చేస్తే అంతమాత్రాన మేము విచారించము.

ఆత్మవిశ్వాసం యెరగని కాంగ్రెస్సాంధ్రులు గజ్జెకట్టి అపాయకరమైన శ్రీబాగు వొడంబడికను సృష్టించారు. అది యిప్పుడు మరా మేకయి కూచున్నది. వెనక మనం హ్రస్వదృష్టి చూపించినట్టే రాయలసీమవారు ఇప్పుడు హ్రస్వదృష్టి కనపరిస్తే రాష్ట్రం సిద్ధించినా మనం యెందుకూ పనికిరాకుండా పోతాము. యునివర్సిటీ వొకచోటా, హైకోర్టు వొకచోటా, రాజధాని వొకచోటా—ఇది మధూకరపు భోజనంలాగ తయారై మన బతుకు సవ్వాలపాలు చేస్తుంది.

మేము బెజవాడను ద్వేషించడం లేదు. కాని మనం మద్రాసు విడిచిపెట్టడానికి వల్లకాదు.

రాజధాని మాట తరవాత చూసుకుందాం. చేతనైతే ముందు యునివర్సిటీని మళ్లీ బెజవాడకు తీసుకువద్దాం రండి. మనం ఆపని చెయ్యగలిగితే శ్రీబాగు వొడంబడిక నిమిషాలమీద రద్దయిపోతుంది. అది అలా కావడం మనకి చాలా అవసరం.

ఇంతకీ:

రాష్ట్రం సాధించుకోవడమూ, రాజధాని నిర్ణయించుకోవడమూ—ఇది అలా వుంచుదాం. అయినా మన యువకులు, అన్ని తరగకులవారూ యిప్పుడు వెంటనే లక్షలకు లక్షలు మద్రాసు ప్రవేశించవలసి వుంది.

ఏమంటే?

సంఖ్యలో యెంత తక్కువగా వుండినా మన ఆంధ్రులు అక్కడ దిక్కుమాలిన స్థితిలో లేరు. అక్కడ మనవారిలో

వకీళ్లున్నారు. డాక్టర్లున్నారు. వర్తకు లున్నారు. ఆఫీసర్లున్నారు. భూస్వాము లున్నారు. పరిశ్రమలు నడిపేవా రున్నారు. ఇంకా అనేకవృత్తులవా రున్నారు. కొత్తవృత్తులను చేపట్టవలసినవా రున్నారు. కాని అందరూ అరవయువకుల సాయం లేకుండా యేమీా చెయ్యలేకుండా వున్నారు. కారణం అక్కడ తగినంత మంది ఆంధ్రయువకులు లేకపోవడమే. దీనికి సాయం యిక్కడ—అంటే—మండలాలలో లక్షలకొలదీ మన యువకులు నిరుద్యోగులై అవస్థపడుతున్నారు. వీరందరూ మద్రాసు ప్రవేశిస్తే వాతావరణం తమాషాగా తయా రవుతుంది.

జాతికి కొత్త చైతన్యం వస్తుంది.

లోకం అంటే యేమిటో బోధపడుతుంది.

కేశవరావుగారు కూడా తాత్కాలికంగా మాత్రమే అనుకుని అయినా వెంటనే మద్రాసు ప్రవేశించవలసి వుంది.

మద్రాసు అంటే చవుటిపఱ్ఱ కాదు.

అది తెనుగుదేశంలో వున్న యేపెద్ద నగరం కంటేనూ కూడా మెదడున్న మనిషికి సంస్కృతి కలిగిస్తుంది.

ముఖ్యంగా అది మనది. మనం విడిచిపెట్టరానిది.

కాంగ్రెస్సు వొక జాతిగా తయారైనది

హిందూమహాసభ, మస్లింలీగు—ఈరెండు సంస్థలే హిందూమాహమ్మదీయసఖ్యతకు పూచీపడవలసినవి. ఈరెండూ ఏకనిశ్చయానికి రాగలిగినప్పుడే అది సఫలం అవుతుంది.

ఏమంటే ? హిందువుల మనుకునే వారికి హిందూమహాసభే ప్రతినిధిసంస్థ. అలాగే మాహమ్మదీయుల మనుకునేవారికి మస్లింలీగే ప్రతినిధిసంస్థ.

హిందూమహాసభ యెంత దృఢపడితే హిందువుల స్వత్వాలకు అంత రక్షణ యేర్పడుతుంది. అలాగే మస్లింలీగు యెంత దృఢపడితే మాహమ్మదీయుల స్వత్వాలకు అంత రక్షణ యేర్పడుతుంది.

ఇందులో వున్న రహస్యం యేమి టంటే ? హిందువులతో కలిసిమెలిసి వుంటేనే మాహమ్మదీయులకు సుస్థితి. అలాగే మాహమ్మదీయులతో కలిసిమెలిసి వుంటేనే హిందువులకు సుస్థితి.

కాగా, హిందువులూ మాహమ్మదీయులూ కూడా తమతమ స్వత్వాలను కాపాడుకోవా లంటే ఎంత పట్టుదల చూపించగలరో అంత త్యాగం కూడా చూపించగలగాలి.

హిందూమాహమ్మదీయసఖ్యత విషయంలో కాంగ్రెస్సుకేమీా ప్రమేయం లేదు. ఇందుకోసం పని చెయ్యడానికి దానికి కొంతమాత్రమూ అర్హత లేదు. జవహర్లాల్ గారు కాంగ్రెస్సు పేరిట కలగజేసుకుని దీన్ని మరింత విషమస్థితికి తెస్తున్నారు గాని అనుకూలస్థితికి తీసుకురాగలగడం లేదు.

జవహర్లాల్ గారూ, తక్కిన కాంగ్రెస్సువారూ కూడా తమ తాహతేపాటిదో గుర్తించుకోలేకుండా వున్నారు.

కాంగ్రెస్సు మతాభిమానాలకు అతీతం అని వారే చెబుతున్నారు. ఇక మతాభిమానంగల జిన్నాగారూ మస్లింలీగూ కాంగ్రెస్సుతో రాజీపడవలసిన అవసరం యేమిటీ? అలా రాజీపడా లనడంలో అర్థం యేమి వున్నదీ ?

ఇది జిన్నాగారికి తెలుసు. అంచేతనే వారు హిందూమహాసభ పోకడలనే గమనిస్తూ వున్నారు. వారు కాంగ్రెస్సువారికి చూపించవలసిన మర్యాదనే చూపిస్తున్నారు.

హిందూమహాసభ కూడా యిదే చేస్తున్నది.

ధర్మంగానే వున్నది.

ఈవొక్క సంగతీ గమనిస్తే కాంగ్రెస్సు నియంతల అవివేకం బోధపడుతుంది.

కాంగ్రెస్సు, మతాభిమానాలు అపాయకరా లని భావిస్తున్నది. కాంగ్రెస్సులో వున్న మాహమ్మదీయులకు మాత్రం యీ వుద్దేశం లేకపోవడం మాట అలా వుంచుదాం. ఈవిషయంలో, కాంగ్రెస్సు, మస్లింలీగు

నాయకులతో సంప్రతించినట్లే హిందూమహాసభ నాయకులతో సంప్రదించ దేం ?

ఇప్పు డేనా కాంగ్రెస్సు, తన త్రిశంకుస్వర్గపదవిని గుర్తించుకోవడం అవసరం.

కాంగ్రెస్సులో వున్న జవహర్‌లాల్ ప్రభృతులు హిందువులుగానే పుట్టినా తమ హిందూత్వాన్ని బుద్ధిపూర్వంగానే చంపుకున్నారు. అది మంచిదా చెడ్డదా అంటే అది వేరే విషయం. అంచేత హిందువులకు ప్రాతినిధ్యం వహించడానికి వారి కేమీ అర్హత లేదు.

వారు మతబాహ్యులు. వారితో రాజీపడవలసిన అవసరం జిన్నాగారి కేమీ లేదు.

కలహాలు పెంచుకున్నా, లేక, స్నేహాలు పెంచుకున్నా హిందూమహాసభకూ, మస్లింలీగుకూ మాత్రమే వృద్ధి. ఆవిషయంలో కాంగ్రెస్సు నిరర్థక మైన సంస్థ.

చేత నైతే, హిందువులలోనూ మాహమ్మదీయుల లోనూ మతాభిమానాలు తగ్గించి, తనలో చేర్చుకోడానికే ప్రయత్నించాలి; గాని, కాంగ్రెస్సు, ఎవరిపక్షానా ప్రాతినిధ్యం వహించడానికి మాత్రం పనికిరాదు.

హిందువులది వొక జాతి.

మాహమ్మదీయులదన్నీ వొకజాతి.

అలాగే కాంగ్రెసున్నూ వొక జాతిగా తయారైనది.

బ్రహ్మసమాజమూ, ఆర్యసమాజమూ సవర్ణహిందువుల విషయంలో ప్రాతినిధ్యం వహించడాని కెలా పనికిరావో, అందుకు, కాంగ్రెస్సు కూడా అలాగే పనికిరాదు.

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

అవ్యవస్థవల్ల కొన్ని వ్యాఖ్యానాలూ, ఈ హెడ్డింగు కింద వచ్చిన జాబులూ అచ్చు పడడానికి వీలు లేకపోయింది. వచ్చే సంచిక మొదలు పేజీలు 24 చేస్తున్నాము. తరవాత ఇంకా ఎక్కువ కావచ్చు.

వ్యవస్థాపకుడు

ఆధునికాంధ్ర వాఙ్మయం

నాళం కృష్ణారావుగారివి

1 తేనెచినుకులు 0-8-0, 2 పాలతరగలు 0-8-0, 3 గోరుముద్దలు 0-4-0, 4 మిఠాయిచెరకులు 0-5-0, 5 వెన్నెలబుడగలు 0-6-0, 6 గోగీతము 0-2-0, 7 పైడిశేడి 0-2-0, 8 ముద్దు 0-4-0, 9 దీపావళి 0-8-0, 10 విరిదండ 0-8-0.

ఉన్నవ లక్ష్మీనారాయణగారివి

1 నాయకురాలు 1-0-0, 2 సంగీతనాటసాని 0-1-0, 3 సోది 0-1-0, 4 భావతరంగాలు 0-1-0, 5 హరిజననాటకం 0-1-0.

కవితా సమితివారివి

1 వైశాఖి 1-0-0, 2 ఉత్కళపతనము 0-12-0, 3 ప్రభవ 0-8-0 4 పూలమాల 0-4-0.

మునిమాణిక్యం నరసింహారావుగారివి

1 కాంతంకథలు 1-0-0, 2 నేనూ మా కాంతం 0-4-0, 3 ఉపాధ్యాయుడు 0-8-0, 4 వక్రరేఖ 1-0-0.

పురాణం సూరిశాస్త్రిగారివి

1 నాట్యోత్పలం 1-0-0, 2 నాట్యాశోకం 1-0-0, 3 విమర్శక పారిజాతం 1-0-0, 4 ఆంధ్రనాటక సంస్కరణం 0-4-0.

ప్రకీర్ణకాలు

1 నాకాభంగం 0-12-0, 2 గోల్కొండకవుల సంచిక 2-0-0, 3 ఉచ్ఛలవిషాదం 0-12-0, 4 రెడ్డికుల నిర్ణయచంద్రిక 1-4-0, 5 సంఘోద్ధరణం 0-6-0, 6 కర్నూలు రాజవంశావళి 0-2-0, 7 ప్రాచీనాంధ్ర నౌకాజీవనచారిత్రం 1-0-0, 8 మునిమాపు 0-12-0, 9 వకుళమాల 0-12-0, 10 సుందరి 1-0-0, 11 నాటకోపన్యాసములు 1-0-0, 12 హృదయ విహంగము 0-4-0, 13 ఆంధ్రమహాసామ్రాజ్యము 1-4-0, 14 Age of Mahabharatawar 1-0-0, 15 జడగంటలు 0-8-0, 16 రహస్యరేఖ 0-8-0, 17 చక్రపాణి 0-8-0, 18 ఆంధ్రకావ్యాలంకార సూత్రవృత్తి 1-4-0, 19 సచ్చిదానందం 1-0-0, 20 గీతమాలిక 0-12-0, 21 సోమనాథవిజయం 0-12-0, 22 భాగవతావతరణం 0-8-0, 23 నవకుసుమాంజలి 1-4-0, 24 చంద్రగుప్త 1-4-0, 25 పునర్వివాహం 1-0-0 26 సాహిత్యమీమాంస 1-8-0, 27 నాటకవిమర్శ 2-0-0, 28 విరిసజ్జ 0-8-0, 29 వేయిస్తంభాలగుడిశాసనం 2-0-0, 30 మల్లికార్జునరావు 0-10-0, 31 ఆంధ్రహృదయం 0-8-0, 32 శల్యాపణం 0-8-0, 33 విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయ చరిత్ర 1-8-0, 34 సంజయ రాయబారం 1-0-0, 35 కృష్ణరాయబారం 1-0-0, 36 కృష్ణసంజయరాయబారం 2-0-0, 37 కర్ణచరిత్ర 0-10-0, 38 శ్రీకృష్ణుడు 0-8-0, 39 కొరవాణి 1-0-0, 40 అపుడు 0-8-0, 41 అప్పుడు 0-8-0, 42 ఇప్పుడు 0-8-0, 43 నిజం 0-8-0, 44 కాలక్షేపం 0-8-0.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారివి

1 రక్షాబంధనం 1-0-0, 2 శ్మశానవాటిక 0-8-0, 3 వారకాంత 0-4-0, 4 గూడుమారిన కొత్తరికం 0-2-0, 5 కలంపోటు 0-3-0 6 విజయనగరరాజుల కథలు 0-2-0, 7 చిత్తూరు రాజులకథలు 0-3-0, 8 ఢిల్లీచక్రవర్తుల కథలు, 0-3-0, 9 గోల్కొండనవాబుల కథలు 0-1-0 10 ప్రబుద్ధాంధ్ర అయిదోసంపుటం గ్లేజుకాగితాలు చక్కని బైండింగు 2-0-0.

కురుగంటి సీతారామయ్యగారివి

తంజాపురాంధ్రనాయకరాజుల చరిత్ర. 2-0-0

రాయప్రోలు సుబ్బారావుగారివి

1 కవితాంజలి 1-0-0, 2 జడకుచ్చులు 1-0-0

చిలుకూరి వీరభద్రరావుగారివి

1 ఆంధ్రులచరిత్ర 5వ భాగం 2-0-0, 2 శ్రీనాథమహాకవి 2-0-0 3 అళియరామరాయలు 1-8-0, 4 తిమ్మరుసుమంత్రి 1-0-0.

గొబ్బూరి వేంకటానందరాఘవరావుగారివి

మహామేధావులు. 1-0-0

మారేపల్లి రామచంద్రశాస్త్రిగారివి

1 తెనుగు తోబుట్టువులు 0-8-0, కవిగారి మనుగడ 0-8-0.

డాక్టరు గుళ్లపల్లి నారాయణమూర్తిగారివి

ఆరోగ్యశాస్త్రము 2-0-0

(ఇది ఆంధ్రయూనివర్సిటీవారేర్పరిచిన పోటీపరీక్షలో అత్యుత్తమమైనదని నిశ్చయించబడి గొప్ప బహుమతి పొందిన గ్రంథము)

R. V. R. జగపతీవర్మగారివి

1 పెద్దాపురసంస్థానచరిత్రము 1-0-0, 2 పద్మనాభయుద్ధము 0-12-0, 3 రామవిలాసము 0-10-0, 4 ఆంధ్రులకథలు 0-10-0, 5 ఆంగ్లదేశకథలు 0-12-0.

కృష్ణకౌండిన్యులవారివి

నందనారుచరిత్రనాటకము 0-8-0

టేకుమళ్ల కామేశ్వరరావుగారివి

1 కోపదారిమొగుడు, 5 అంకాలనాటకం 0-4-0, 2 జానకి ప్రేమ మొదలైన చిన్నికథలు 0-5-0.

మొక్కపాటి నరసింహశాస్త్రిగారివి

1 ప్రతిబింబములు (చిన్నకథలసంపుటి) 0-12-0, 2 ఏకోదరులు (నవల) 0-8-0.

మారేమండ రామారావుగారివి

1 మధ్వాచార్యులవారి చరిత్ర 1-0-0, 2 భారతీయవిద్యాచరిత్ర 0-12-0.

తుపాకుల అనంతభూపాలునిది

విష్ణుపురాణము వచనము 0-12-0

(ఇది ఆంధ్రకవుల చరిత్రలో ప్రశంసించబడిన పూర్వపు వచనగ్రంథము

కళాభివర్ధనీ పరిషత్తు రాజమండ్రి

రాజమహేంద్రవరము : శ్రీ అడ్డేపల్లి లక్ష్మణస్వామినాయుడుగారిచే సరస్వతీ పవర్ ప్రెస్‌నందు ముద్రితమై

సంపాదకుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి   సంవత్సరం చందా ౩—౦—౦

ప్రబుద్ధాంధ్ర

సంపుటం ౮ } రాజమండ్రి ౨౮ ఫిబ్రవరి ౧౯౩౮ { ౬ వ సంచిక

1-3-35

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

ఇవి యిప్పుడు విడివిడిగా అచ్చు అవుతున్నవి
వెల 100 పేజీలకు 0-4-0 రేటున వుంటుంది
తక్కువ వెల 0-1-0 ఎక్కువ వెల 0-4-0

తయారైనవి

1. గూడుమారిన కొత్తరికం వెల 0-2-0
2. కలంపోటు వెల 0-2-6

అచ్చులో వున్నవి

1 తల్లిప్రాణం, 2 ఇల్లుపట్టిన వెధవాడపడుచు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

ఇవి యీ క్రింది స్థలాలలో, యీ క్రింది కంపెనీలలో దొరుకుతవి. లేకపోతే మాకు తెలియచెయ్యండి.

1. మద్రాసు

1. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సు
2. వేంకటరామా అండు కో

2. తెనాలి

1. నాముల సీతారామయ్యగారు
2. వేంకటరామా అండు కో

3. బెజవాడ

1. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సు
2. వేంకటరామా అండు కో

4. సికింద్రాబాదు

1. వేంకటరామా అండు కో

5. ఏలూరు

1. వేంకటరామా అండు కో

6. పాలకొల్లు

1. వేంకటరామా అండు కో

7. రాజమండ్రి

1. కళాభివర్ధనీ పరిషత్తు
2. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సు
3. వేంకటరామా అండు కో
4. రెడ్డి బ్రదర్సు
5. ఆర్యపుస్తకాలయం

8. విశాఖపట్నం

1. వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు
కళాభివర్ధనీ పరిషత్తు—రాజమండ్రి

పబ్లిషర్సు
కళాభివర్ధనీ పరిషత్తు
మెయిన్ రోడ్డు—రాజమండ్రి

సరస్వతిగ్రంథమండలి

కంభంవారి సత్రమువీధి *** రాజమహేంద్రవరము

నవలలు—నవరసభరితములగు నవలలు—ముచ్చటగూర్చు అచ్చుతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో—రెండుమాసముల కొకక్క—చక్కని నవల. నడుమ నడుమ చిన్నచిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0-4-0 చందాదారులు ఒకేసారి రు 7-8-0 ను ముందుగా పంపినచో వరుసగా ఆ పుస్తకములు అన్‌రిజష్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11 ప్రేమసుందరి	1	8	0
11 చోరశిఖామణి	1	8	0
13 లక్ష్మీప్రసాదము	1	8	0
14 హత్యారహస్యము	1	8	0
16 ఫాస్టు (1వ భాగము)	1	8	0
16 ఫాస్టు (2వ భాగము)	1	8	0
17 కుముద్వతి	1	8	0
18 చిన్నకోడలు	1	8	0
19 రహస్యభేదనము	1	8	0
20 సింహగడము	1	8	0
21 మణిహారము	1	8	0
22 మొగలాయిదర్బారు 1 భా॥	1	8	0
23 ఘటనాచక్రము	1	8	0
24 రాజసుందరి	1	8	0
25 కుంకుమభరిణె	1	8	0
26 జాగిలము	1	8	0
27 మొగలాయిదర్బారు 2 భా॥	1	8	0
28 సరస్వతి	1	8	0
29 ఆనందాభాయి	1	8	0
30 హత్యాన్వేషణము	1	8	0
31 మొగలాయిదర్బారు 3 భా॥	1	8	0
32 గంగ	1	8	0
33 మొగలాయిదర్బారు 4 భా॥	1	8	0
34 కోహినూరు	1	8	0
35 ఆత్మసమర్పణ	1	8	0
36 అపరిచిత	1	8	0
37 అంతఃపురము (1వ భాగము)	1	8	0
38 అంతఃపురము (2వ భాగము)	1	8	0
39 అగ్రహారము	1	8	0
40 ఛిన్నహస్తము (1వ భాగము)	1	8	0
41 ఛిన్నహస్తము (2వ భాగము)	1	8	0
42 కంకణరహస్యము	1	8	0
43 సంజీవి (1వ భాగము)	1	8	0
44 సంజీవి (2వ భాగము)	1	8	0
45 ప్రజారాణి,	1	8	0
46 హత్యాభ్రమ	1	8	0
47 రాతిఖండము	1	8	0
48 సేవాశ్రమము (1వ భాగము)	1	8	0
49 సేవాశ్రమము (2వ భాగము)	1	8	0
50 దాసీకన్య	1	8	0
51 స్త్రీసాహసము ప్రథమభాగము	1	8	0
52 స్త్రీసాహసము 2వ భాగము	1	8	0
53 మేరరాణి	1	8	0
54 రాజ్యలక్ష్మి	1	8	0

అనుబంధములు

1 మృత్యురంగిణి	0	12	0
2 అభాగిని	0	12	0
3 ఛద్మవేషి	0	12	0
4 వివేకుని యుపదేశములు	1	0	0
5 కాంచనమాల	1	0	0
6 సీమంతిని	1	0	0
7 సుశీల	1	0	0
8 శశిరేఖ	1	0	0
9 యమునాబాయి	1	0	0
10 శ్యామల	1	0	0
11 కాంతంకథలు (చిన్నకథలు)	1	0	0
12 కాలసర్పి	1	0	0
13 భారతకథాసారం	1	0	0
14 కథాకల్పవల్లి (చిన్నకథలు)	1	0	0
15 అరక్షణీయ	1	0	0
16 మాధవి	1	0	0
17 లలిత	1	0	0
18 పెండ్లిదండు	1	0	0
19 కథావళి	1	0	0
20 నాలుగుకథలు	1	0	0
21 స్త్రీప్రబోధిక	1	0	0
22 అదృశ్యము (1వ భాగము)	0	12	0
23 ఉదంకుడు	0	12	
24 కేతాకీకథలు	0	12	
25 దయ్యాలు	0	12	

నాటకములు

1 మార్కండేయ	0	12	0
2 అహల్యాశాపవిమోచనము	0	12	0
3 మీవారుపతనము	1	0	0
4 వరమాల	1	0	0
5 షాజహాను	1	0	0
6 నూర్జహాను	1	0	0
7 దుర్గాదాసు	1	0	0
8 చంద్రగుప్త	1	0	0
9 దంపతులు	1	0	
10 విజయవిజయం	1	0	
11 భక్తకుచేల	1	0	

☞ ఈ గ్రంథములు రాజమండ్రీలో కలాభివర్ధనీ పరిషత్తులోను దొరకును

వస్తుగుణప్రకాశిక మాదిరి పేజీ

మోదుగుచెట్టు :— పలాశ - కింశుక - యాజ్ఞిక —
Butea Frondosa.

పర్యాయపదములు : యాజ్ఞికః, యజ్ఞప్రధానేంధనము. సమిద్వరః, ఇంధన శ్రేష్ఠకాష్ఠము. వక్రపుష్పః, వంకరగానుండు పూవులుకలది. రక్తపుష్పః, ఎఱ్ఱని పూవులుగలది. త్రిపర్ణ, మూడాకులు గల తొడిమగలది. బీజస్నేహ, విత్తులయందు చమురుగలది. క్షారశ్రేష్ఠ, క్షారద్రవ్యములలో శ్రేష్ఠమైనది.

స్వరూపము : మోదుగి, అరణ్యక వృక్షము. ఆంధ్రారణ్యములో విస్తారముగా గలదు. ఆకులు గుండ్రముగా నుండును. ఆకులు వంటరి చేరక గలిగియుండును. ఆకులు విస్తరులనుకుట్టి భోజనపాత్రలుగా నుపయోగింతురు. కాయలు పొడవుగను వంకరగను, యుండును. కాయలోని గింజలకే మోదుగుమాడియందురు. గింజ బల్లపరుపుగా బద్దవలె గుండ్రముగా నుండును. రంగు, యెరుపు. పొట్టు తీసిన తెల్లగా నుండును. కాయలలోని గింజలసంఖ్యనుబట్టి రహితము, భవిష్యత్కాలముయొక్క సుభిక్షదుర్భిక్షములను నిర్ణయింతురు. దీని కఱ్ఱలో నగ్ని గలదు. మథించిన నిప్పుపుట్టును. దీనిలో నాలుగురకములున్నట్లున్నది ; తెలుపు, యెరుపు, నలుపు, పచ్చని పూలరంగుల భేదముచే రకము తెలియుచున్నది. తెలుపు, యెఱుపులు తప్ప తక్కినవి దుర్లభములు.

గుణములు : ధన్వంతరినిఘంటువు : క్షారప్రధాన ద్రవ్యము. క్రిములను చంపును. సంగ్రాహి, దీపనకారి, సరగుణముకలది. ప్లీహ, గుల్మ, గ్రహణీ, అర్శ (మూలవ్యాధి) వాతశ్లేష్మములను హరించును. పూవు, సుగంధి, మధురరసము గలది. (బీజము కారముగా నుండును. స్నిగ్ధగుణముగలది, వేడిచేయును. క్రిములను, శ్లేష్మమును హరించును.

రాజనిఘంటువు : ఇది వగరు రుచి గలది. వేడిచేయు స్వభావముగలది. క్రిమిదోషములను హరించును. గింజలు చిడుము, దద్దులను, మరదలను హరించును. త్వగ్దోషములనెల్ల బోగొట్టును. గావు వేడిచేయు స్వభావములు గలది. మరదలను, కుష్ఠమును పోజేయును

భావప్రకాశిక : వగరు, కారము, చేదును గల రుచులు గలది. స్నిగ్ధగుణము గలది. మూలవ్యాధులను హరించును. విరిగిన యెముకలను అతుకును. క్రిమిహరము. గ్రహణులను కట్టును.

పువ్వు : వేడిచేయును. విపాకమున కారపురుచిగా మారును. కటు, తిక్త, కషాయరసములు గలది. వాతలము, కఫపిత్తములను హరించును. రక్తదోషమును బోగొట్టును. గ్రాహి, చల్లగా నుండును. దప్పిని, తాపమును హరించును. వాతరక్తకుష్ఠరోగముల హరించును. గింజలు లఘుగుణము గలవి. వేడిచేయును. మేహములను, మూలవ్యాధులను, క్రిములను, వాతకఫమును బోగొట్టును.

శోధలనిఘంటువు : కాండము రసాయనము. బీజము క్రిమిహరము. పుష్పము అంధ్యమును బోగొట్టును. మూలస్వరసము నేత్రరోగముల నడచును.

ప్రయోగములు : తేలుకాటునకు :—మోదుగిగింజను జిల్లేడుపాలతో నూరి, కాటుపై వేసిన విషము హరించును. (విషాధికారము. వంగసేన)

యోని గట్టిపడుటకు :—మోదుగుమాడను, మేడిపండును, మంచి నూనెతో నూరి, యందు తేనెను కలిపి యోనియందు పూసిన యోని గట్టిపడును. (యోని రోగాధికారము. వంగసేన)


పైత్యపు కండ్లకలకలకు :—పలాశపుష్పరసమును నేత్రమున కంజనమిడిన పిత్తాభిష్యందములు హరించును. (వంగసేన)

రక్తపిత్తమునకు :—మోదుగిపట్టను కషాయముపెట్టి చల్లారిన పిదప పంచదారను కలిపి సేవించిన రక్తపిత్తము హరించును. మరియు, నిందు తేనెయును, నేయియును గూడ జేర్చవలెను. (చి. 2 అ. వాగ్భటము)

మూలవ్యాధికి :—కాల్చిన మోదుగ బూడిదలో మూడురెట్లు నీళ్లుపోసి త్రికటుకములను కల్కము జేసివేసి, తయారుజేసిన ఘృతమును సేవించిన మూలము లూడిపడును. (అర్శ. చి. చక్రదత్త)

క్రిములకు :—మోదుగగింజల స్వరసమునుగాని, కల్కమునుగాని బియ్యపుకడుగుతో సేవించిన క్రిములు హరించును. (ఉ. 54 అ. సుశ్రుత)

(సశేషము)



సంపుటము ౮ | రాజమహేంద్రవరము [illegible] | [illegible] సంచిక

రాశి పెరిగితే రకం చెడకమానదు

"ఇక వేరే పనులేలే?" అన్నట్టు సావకాశంగా— అదే పనిగా హాహాహూ అనుకుంటూ "దేశం దేశం యావత్తూ కాంగ్రెస్సులో చేరాలి" అంటూ వారు వైపున కాంగ్రెస్సుమంత్రులు ప్రచండమైన ప్రచారం చేస్తున్నారు.

"ప్రజలు కాంగ్రెస్సుసభ్యత్వమును నేడు గౌరవముగా దలంచుచున్నారు" అని మరొక ప్రక్కన కాంగ్రెస్సు పత్రికలు కైవారాలు చేస్తున్నవి.

"ముప్ఫయి లక్షల సభ్యులు! హో! ఏమి ఘనమయ్యా మనది!" అంటూ యింకొక ప్రక్కన కాంగ్రెస్సు నాయకులు మురిసిపోతున్నారు.

కాని "కాంగ్రెస్సు శక్తి త్వరగా అభివృద్ధి చెందుచున్నది. ఈసంవత్సరము కాంగ్రెస్సుసభ్యుల సంఖ్య 30 లక్షలుండెను. ప్రపంచములో ఏయొక్క సంస్థకును ఇంత యెక్కువ సంఖ్య లేదు. రష్యాలో కమ్యూనిస్టు పార్టీసభ్యుల సంఖ్యకన్న యిది యెక్కువ యుండునేమో" అంటూ పరమానందపడుతూ నివేదనం ప్రారంభించిన కాంగ్రెస్సు శెక్రటరీ జే. బీ. కృపాలినీగారు, ఉత్తరక్షణంలోనే "ఎవరు పట్టిన వారు— స్వార్థపరులు అవినీతిపరులు— ఏమైనా కాగలుగు పట్టువారు— తమ ధనము, ఆస్తి యేమగునో రక్షించుకొనవలె నని కోరెడివారు" కాంగ్రెస్సులో చేరుతున్నారనీ, "దీని వల్ల కాంగ్రెస్సుకు ప్రమాదం తటస్థిస్తూ వున్న" దనీ గాభరాపడిపోతున్నారు. "సైనిక గుమస్తాకీలు కూడ చాల కష్టకార్యములు. సమయానిర్ణయములు ఎల్లా వారికీ గాని, యుక్తముగా గాని ఉచితముగా నేర్పడ లేదు. ప్రత్యేకముగా గుమస్తాకిలున్న [illegible] ఎన్నిక లుండిన మేలుగా నుండగలవు" అని వినాదిస్తున్నారు.

"అంతే కాక, కాంగ్రెస్సు కార్యాలయోద్యోగులను (కాంగ్రెస్సు సివిలు సర్వీసు) కూడ కొన్ని నియమములకు లోను చేయవలెను. అసలున్న, కాంగ్రెస్సు కార్యాలయాధికారులుగా నున్నవారు తమ రాజకీయ పక్షపాతములచే కొన్ని తెగలలో చేరి ([illegible] పటేలుగారిని, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్సుసంఘాన్ని ఉద్దేశించి కాదుగదా) భిన్నాభిప్రాయములు వ్యక్తపరుస్తూ తమ అభిప్రాయముల ప్రచారమునకై కాంగ్రెస్సుకార్యాలయము నుపయోగిస్తున్నారు" అని తహతహలాడిపోతున్నారు.

ఏం? ఎందుకు వచ్చిందీ యీ వైపరీత్యం?

పావలా—సంవత్సరానికి లెక్క నాలుగణాలు— ఉక్కుమేడను కాల్చేస్తూ వున్న లక్కసీలు యిదీ.

కాంగ్రెస్సులో చేరాలంటే, మనిషికి వుండవలసిన యోగ్యత సంవత్సరానికి నాలుగణాలు విసిరిపారెయ్య

గలుగడం. దీనివల్ల, సభ్యుల సంఖ్య లక్షలు కాదు, కోట్లు—అర్బుదాలు కావచ్చు. కాని యోగ్యత? మర్యాద?

అసలు నాయకులకే యీ వూహా తట్టలేదు. తమ పక్షం పెద్దగా అని పేరు రావాలి. ఇంతే వారిబుద్ధివిధవం. అయితే, ఎందులోను ఆపేక్షతం?

కాంగ్రెస్సు సిద్ధాంతాలు నిజంగా మంచివా? అనం గతి ముజువు చెయ్యండి. ప్రజలు శిరసావహిస్తారు. కాంగ్రెస్సు వుపదేశాలు దేశవికాసం కలిగిస్తాయా? ఆసంగతి విసారంగా బోధపరిచండి. ప్రజ లందరూ ఆపని చేస్తారు. కాంగ్రెస్సుసభ్యు డైతే గాని, మనిషి దేశాభి మాని కాడా? సత్కార్యపరాయణుడు కాడా? త్యాగి కాడా?

మరి, గాంధిగారి మాట యేమిటి?

ఒక్క గాంధిగారు మాత్రం తప్ప తతిమ్మా అందరూ కాంగ్రెస్సులో చేరాలా యేమిటి?

కాంగ్రెస్సు సభ్యు లందరూ మొన్నటి యెన్నికల్లో కాంగ్రెస్సు అభ్యర్థులకే వోటు చేశారా? కాంగ్రెస్సు సభ్యులు కానివారు కొందరు కాంగ్రెస్సు అభ్యర్థులకు వోటు చెయ్యలేదూ? పోనీ ఆకాంగ్రెస్సు అభ్యర్థిగా నిలబడినవా ప్రతివారూ కాంగ్రెస్సులో వుండతగినవారేనా?

ఆ అభ్యర్థుల యోగ్యతలు పరిశీలించడంలో—ఎన్ని యించడంలో—అంగీకరించడంలో కూడా అక్రమాలు జరుగలేదూ?

"వీరిలో కొందరు తమలో తమకు గల భావవైరు ధ్యములచే గిట్టిన యితరుల సాధింపులకు గూడ వెను దీయలేదు. చొరవ, నోటిదురుసుతనము కలిగి, మర్యాద పాటింపనివారు అఖండభారత కాంగ్రెస్సుసంఘం యెన్ని కలలో విజయము గాంచి, స్వయముగా ప్రచారము చేసి కొనుట కిష్టము లేని మర్యాదస్తు లయిన—నిజ మగు దేశసేవకులు ఓడించుండిరి" అంటున్నారు కృపాలినీ గారు. అయితే: ఇంకా పైవారిలో కూడా యీరకం మనుష్యు లెందరున్నారో కృపాలినీగారు తెలుసు కున్నారా?

నిజంగా, కాంగ్రెస్సు, రషియాలోని కమ్యూనిష్టు పార్టీకంటే కూడా పెద్దదే అంటే మాకేమీ అభ్యం తరం లేదు; కాని అదేం చేసింది? ఇదేం చేస్తూ వుంది? ఈవిచారణ అక్కర్లేదూ?

పోనీ, ఈముప్పయి లక్షల సభ్యులలోనూ అనేకులు అనాలు గేసి అణాలూ తమ సొంతంలోనుంచి యిచ్చిన వారు కారని కృపాలినీగారికి తెలుసా? మరిన్ని, ఆముప్పయి లక్షలమందిలోనూ, అనేకులకు తాము కాంగ్రెస్సుసభ్యుల మనే సంగతే తెలియ దని కృపాలినీ గారు యెరుగుదురా?

అయితే: వారంతా కాంగ్రెస్సులో సభ్యు లెలా అయినారూ? ఇందు[illegible]హస్యం యేమీ లేదు. ఇది కాంగ్రెస్సు నాయ[illegible] హరించుమన్నామనే అవుతున్న వారే చాలామంది చే[illegible]గుణము గలవి.

కులాభిమానుల [illegible], తూర్పుగోదావరిజిల్లా బోర్డు అధ్యక్షత సంపాదించుకున్న నా కానొక కాంగ్రెస్సు పెద్దమనిషికి, మొగమోటపెట్టి అనేకంగా వుపకారాలు చేయించుకోవచ్చు ననే వుద్దేశంతో జిల్లా అంతటా అనేకగ్రామాలవారు విందులూ, టీపార్టీలూ వగైరా అనేకసత్కారాలు చేశారు. అలా చేసిన గ్రామాలలో మా మహేంద్రవాడకు కొంచెం సమీ పంగా వున్న గ్రామం వొకటి. ఉదయమే ప్రెసిడెంటూ, ఆయన కర్ణధారీ, మరి కొందరు మిత్రులూ వచ్చారు. సమీపగ్రామాల పెద్దమనుష్యులున్నూ వందలువచ్చారు. మధ్యాహ్నం పిండివంటలతో భోజనా లయినాయి. చల్ల బడ్డ తరవాత టీపార్టీ కూడా అయింది. సభాస్థలం అంతా చక్కగా అలంకృత మయి వున్నది. పూర్తిగా నిండిన్ని పోయింది. నిర్వాహకులు బాండు మేళంతో వచ్చి "మరి దయచెయ్యండి" అని ప్రెసిడెంటుగారిని ఆహ్వానించారు. కాని ప్రెసిడెంటు లేవలేదు. ఏమంటే? మొదట సూచనగా మందహాసం చేశారు. చివరికి "మీ వూళ్లో రెండువందలు కాంగ్రెస్సు సభ్యులు చేరితే గాని మీ సత్కారం నాకు అక్కర్లే" దని స్పష్టంగా చెప్పారు. ఊరివారు మొగమొగాలు చూసు

కున్నారు. ఎంతమందిని కలుసుకుంటే రెండువందలమంది చేరడానికి వొప్పుకుంటారూ? దాని కెంతసేపు పట్టుతుందీ? అందుకు కాలం యేదీ? ఊరివారు తెల్లపోయారు. కాని కర్ణధారి వున్నాడు కాదూ? ఎన్నో యజ్ఞాలు చేసిన పెద్దమనిషి ఆయన. సమయానికి గిన్నెమని ఆయన ముందుకు వచ్చాడు. "దీని కింత ఆలోచన యెందుకూ? ఇంత తొట్రుపాటు మాత్రం యెందుకూ? మీకు వందేసి రశీదు లున్న పుస్తకాలు రెండిస్తాను ప్రెసిడెంటుగారు. మీరు యాభై రూపాయలూ ముందు ఇచ్చెయ్యండి" అన్నాడు. సెబాస్! ఊరివారి చేతిలో రశీదుబుక్కులు పడ్డాయి. ప్రెసిడెంటు చేతిలో యాభై కరుకులు రాలాయి. ఎప్పుడో అనుకున్న కౌంటరు ఫైయిల్సు కూడా దీపాలు పెట్టకుండానే కర్ణధారి చేతికి వచ్చాయి. ఆశ్చర్యం యేమిటీ? రెండువందల పేర్లు రాయడానికి వొక్కొక్క సూక్కాలుమాస్టరుకు ఎంతసేపు పడుతుందీ? ఆకౌంటరు ఫైయిల్సులో వున్న పేర్లవారందరూ బతికే వుండాలని నిర్ణయం యేమిటీ? ఆ పేర్ల వారు కొందరు అసలు పుట్టే వుండకపోతే మాత్రం యేం మునిగిపోయిందీ?

ఇలాంటి గమ్మత్తు లెక్కడ జరగలేదూ? ఎన్ని గమ్మత్తులూ జరక్కపోతే ముప్ఫయి లక్షల సభ్యులు వచ్చారూ?

అయితే: కృపాలినీగారికి ఇలాంటి కుళ్లుపను లన్నీ యిప్పటి దాకా తెలవకుండానే వున్నాయా? ఇవాళ కొత్తగా తెలిశాయా?

మేము నమ్మలేము. ఇవన్నీ మనసులో పెట్టుకుని, వారికి, ఇలాంటి నివేదిక రాయవలసిన పెద్ద యిబ్బంది యేదో వచ్చింది. అది భరించడానికి శక్యం కాకపోయి వుంటుంది. కుళ్ళంతా వారు బయటపెట్టేశారు. అంతే.

అంతే గాని, యోగ్యత విలవ నాలుగణాలుగానే నిర్ణయిస్తే రాశి పెరుగుతుందే గాని రకం కల్తీగా వుంటుం దని తెలుసుకోలేనంతటి అవివేకులు కారు కాంగ్రెస్సు ప్రముఖులు.

ఇక వున్న దల్లా యేమి టంటే? వారు మొదణ్ణుంచీ తప్పుదారిలో పడిపోయారు. అంతమందీ కూడా తప్పు గుర్తించలేకపోయారా అని అడగడానికి వీలులేదు. ఏమంటే? వారందరూ గాంధిగారు చెప్పినట్టు చెయ్యవలసినవారే గాని స్వబుద్ధి వినియోగించుకోడానికి అధికారం వున్నవారు కారు.

అలా కాక, దేశీయు లందరూ యేక తాటిమీద వుండవలసిన అగత్యం చాలా హెచ్చుగా వుండినప్పటికి, పాక్షికాభిమానవిషం పోసి స్వేచ్ఛాళైన హృదయాలను పంకిలాలు చెయ్యక, ప్రజలను ప్రజలుగానే వుంచి, యీ కాంగ్రెసు ప్రముఖులు, దేశంయొక్క స్థితిగతులన్నీ వారికి చక్కగా బోధపరుస్తూ, ప్రాపంచిక పరిస్థితులున్నా విప్పి చెబుతూ, తమసిద్ధాంతాలను మనసుకు పట్టేటట్టు విశదపరుస్తూ, ప్రజలు వాటి నాచరణలో పెట్టేటట్టు జాగ్రత్తపడుతూ, సమయం వస్తే వారందరూ తమకే వోటు చేసే టంతటి యోగ్యత తమదగ్గిర కనపరుస్తూ, ముక్కాకలూ తీరి తాము లీలామానుషవిగ్రహాలుగా భాసిస్తూ వుంటే యెంత చక్కగా వుండునూ?

కాని, అసలు, కాంగ్రెస్సు ప్రముఖులలోనే కుళ్లు పెరుకుని వున్నది. స్వార్థపరులు—అవినీతిపరులు—ఈర్ష్యాపరులు—పదియిండ్లకాగొడుగు పట్టేవారు అగ్నిహోత్రంలో వుండినన్నీ డబ్బుకోసం పాకులాడేవారు—ఇంకా అనేకరకాలవారు కాంగ్రెస్సు నాయకులలోనే అధికంగా వున్నారు.

వారిని చూసి నేర్చుకున్నవారే గాని, క్రిందివారు, స్వయంవ్యక్తిత్వం కలవారు కారు.

ఇలాగ, యెటు చూసినా, కాంగ్రెస్సు ప్రణాళిక దోషభూయిష్ఠంగా వున్నది. ఇవాళ కృపాలినీగారు, ఏవో కొన్ని కారణాలను పురస్కరించుకుని ఫలితాలను నిందిస్తే ప్రయోజనం లేదు. సిద్ధాంతానికి గౌరవం తెచ్చేవారూ, విలవ కలిగించేవారూ అనుయాయులు కాని ప్రచారకులూ, నాలుగణాలు పారేసి టిక్కట్టు కొనుక్కున్నవారూ కారు.

అయితే: 30 లక్షల సభ్యులవల్లా వసూలయ్యే వేయిలక్షల యాత్రికోలూ పరిపాలుకోవడం కాంగ్రెస్ ప్రముఖులకు సాధ్యం అయ్యే పని కాదు. సహజంగా ఆ సొమ్ము వల్లనే వారు అనేక ప్రశ్నలెలో నిండా తలమున్కలుగా వున్నారు.

కాని ప్రజలను మంచిదారిలో నడిపిస్తేకూడా కాంగ్రెస్ నిర్వహణానికి డబ్బుకొరత రాదు. అయితే, అవకాశం కాంగ్రెస్సువారికి తప్పిపోవచ్చు.

ఇంతేకే: స్వరాజ్యసాధనకు కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రముఖులలో యిలాంటి పరిణామం కలిగిస్తాయో చెప్పలేము; గాని, "ప్రత్యేకపు యొన్నికల కిన్న సర్దోషము ఎన్నిక లుండేవి మేలుగ నుండగలవు" అనే రిమార్కు మాత్రం దొరతనంవారు ఏర్పరిచిన ఫెడరల్ అసెంబ్లీ యెన్నికలను ఆక్షేపించే యోగ్యతను కాంగ్రెసువారికి లేకుండా చేస్తున్నది.

మాటన్న, ముప్ఫయి లక్షల సభ్యులవల్ల వచ్చే చిక్కులు సహించలేక యిలాంటి రిమార్కులు రాయడం, కాంగ్రెస్సువారికి "వయసువచ్చినవారి కందరికీ వోటింగు అధికారం యివ్వాలి" అను గవర్నమెంటును నిలదీసేందుకు అధికారం లేకుండా చేస్తున్నది.

భళీ అంటున్నదే పత్రికోద్యోగం

ఈనెల ౧౪ వ తేదీని, పబ్లిక్ వర్క్సు మంత్రిగారి పార్లమెంటరీ సెక్రటరీ గిరంతులగారు, మద్రాసులో, లాకాలేజీ కర్నాటకసంఘమువారి కోత్సవసందర్భాన, కర్నాటకరాష్ట్ర నిర్మాణాన్ని గురించి వుపన్యసిస్తూ చెప్పిన మాటలమీద వ్యాఖ్యానం చేస్తూ (౧౫—౨—౩౮) ఆంధ్రపత్రిక "ప్రత్యేకాంధ్రరాష్ట్రనిర్మాణమును గూర్చి చేయు (జరుపబడు) చున్న ఆందోళనము యొక్క ప్రాముఖ్యమును గుర్తించిరి" అంటున్నది.

అయితే, యేమిటి గుర్తిస్తే?

దానివల్ల మనకి వొరిగే దేమిటి?

ఆరు జిల్లా లయినా పూర్తిగా లేని దొప్పెడు కర్నాటకభూభాగాన్ని, ప్రత్యేకించి వొక రాష్ట్రం నిర్మించాలని కోరే కన్నడమునకు, పదమూడు జిల్లాల నిండు ఆంధ్రభూభాగాన్ని, ప్రత్యేకించి రాష్ట్రం నిర్మించవలసిం దని జరుగుతూ వున్న ఆందోళనం ప్రాముఖ్యాన్ని గుర్తించడం, సహజంగా, మనమీద సానుభూతి వుండీ, అనుగ్రహం వుండీనా?

ఇందులో చాలా దూరపువున్నది. మంచి గమనించాలి కూడా వున్నది.

అది గుర్తించకపోతే గిరంతులగారి మాటలమీద వ్యాఖ్యానం చెయ్యడం కేవలమూ నిరర్థకం.

పరికించి చూడగలిగితే, కార్యపరుల కుండవలసిన పరిజ్ఞానమూ, సమయస్ఫూర్తీ గిరంతులగారివద్ద చాలా మెండుగా వున్నవి.

సహజంగా, మన అపారమేధావంతుల కలాంటి వ్యక్తిత్వం వుంటే, ఆంధ్రరాష్ట్రం యెన్నడో నిర్మించబడి వుండేది.

చెప్పవచ్చిం దేమి టంటే?

నాలుగు భాషల సమష్టిరాష్ట్రం అయి వున్న మద్రాసును, ఎప్పటికి కయినా భాషాప్రయుక్తంగా విడగొట్టడం అంటూ జరిగితే, అది ఆంధ్రరాష్ట్రనిర్మాణం సందర్భంలోనే జరుగుతుంది; గాని మూడే మూడయి వున్న కన్నడజిల్లాలు విడదియ్యడం కోసం జరగదు.

పైగా, ఆంధ్రరాష్ట్రం నిర్మించాలంటే వొక్క మద్రాసు విడగొడితే చాలు. కన్నడరాష్ట్రం నిర్మించాలంటే, యేకకాలంలో, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలు రెండూ గిల్లి పోగులు పెట్టాలి.

ఇంకొకటి కూడా వుంది.

కన్నడులవల్ల, ప్రపంచం తల్లక్రిందు లయే టంతటి మహోత్పాతమో, త్రిలోకాధిపత్యం నెరవేరే టంతటి అసాధారణప్రయోజనమో సిద్ధించే సూచన లుంటే తప్ప, దొరతనంవారు, ఆంధ్రరాష్ట్రనిర్మాణం మాట స్మరించ నైనా స్మరించకుండా, ప్రత్యేకశ్రద్ధతో కర్నాటకరాష్ట్రనిర్మాణానికి పూనుకోరు.

కాగా, కన్నడులు, కర్నాటకరాష్ట్రనిర్మాణం చేయించుకోవాలంటే ఆంధ్రరాష్ట్రసాధనప్రయత్నాలకు దోహదం చేసి తీరాలి.

ఇలాగ, ప్రత్యేకించి ఆంధ్రరాష్ట్రనిర్మాణం కోసమే అయినా, కన్నడజిల్లాల అభ్యున్నతికోసం కూడా అయినా, దొరతనంవారు, మద్రాసును విభజించడానికి పూనుకున్నప్పుడు, ఇది చూపిస్తూ, బొంబాయిలోవున్న తమ తక్కిన మండలాలు విడదీయించుకోవడం, కన్నడులకు చాలా సులువైన పని.

కరంతుగారికి ఈవిషయం పూర్తిగా తెలుసు. కనకనే వారు ఆంధ్రరాష్ట్రప్రస్తావన చేశారు.

అయితే; కరంతుగారింతటితో వూరుకోలేదు.

రాజనీతి విద్యార్థులలో వారు చాలా చురుకైనవారుగా కనపడుతున్నారు.

వారు ఇంకా యేమన్నారంటే ?

"మదరాసును ఆంధ్రరాష్ట్రములో చేర్చవలెనని కొందరనుచున్నారు. మదరాసుకు ఉత్తరమున 40 మైళ్ల వరకును గూడ కేవలము తమిళదేశమే యున్నది"

ఎందుకీ మాటా ?

మద్రాసు యెవరిదైతే కరంతుగారికేం ?

కన్నడులకు లాహోరెంతో, కలకత్తా యెంతో, సిలోను యెంతో మద్రాసూ అంతే. మద్రాసురాష్ట్రం భాషాప్రయుక్తంగా విడిపోతే, మద్రాసునగరం యెక్కడవుండో కన్నడులకు తెలియవలసిన పని యేమీ లేదు. అప్పటిదాకా యెందుకూ ? ఇప్పుడయినా మద్రాసుకూ, కన్నడులకూ రక్తసంబంధం యేమీ లేదు. కన్నడులు మద్రాసుకు పూర్తిగా విదేశీయులు.

"మద్రాసు ఆంధ్రమండలములలోని దనుట కరంతుగారికి అన్యాయముగ తోచుచున్నది. వారికీ పట్టణ చరిత్ర తెలిసియున్న నటుల చెప్పియుండరు"

అంటున్నది ఆంధ్రపత్రిక.

కాని, యిది, పూర్తిగా పొరపాటు వూహ. కరంతుగారికి, మద్రాసు చరిత్ర, మనకి కంటేనూ, అరవలకంటేనూ చాలా బాగా తెలుసు. అంచేతనే వారీ మాట అనగలిగారు.

ఇందులో వున్న నయవంచన యేమిటంటే ?

మనము, మద్రాసు "మనది" అంటున్నాము. అంటే, కరంతుగారి నిష్కృష్టసిద్ధాంతాన్ననుసరించి, మనం, నలభై మైళ్ల శుద్ధతమిళదేశాన్ని సామ్రాజ్యం చేసి ఆక్రమించుకోవాలని చూస్తున్నామన్నమాట.

దీనిమీద, నిజం తెలిసినవారు చివరికేం చేసినా, ఇంత దురంతం జరగబోతూవుంటే జాతిమొత్తం మీద తమిళులు వూరుకుంటారా ?

కరంతుగారు కోరుకుంటూవున్న ప్రయోజనం యిదీ.

తమిళులను మనమీదకి కవ్వించడానికే వారీ మాట అన్నారు.

ఇంతేనా ?

వారు, ఇంతటితో కూడా వూరుకోలేదు.

ఇద్దరు వ్యక్తులచేత కుస్తీ పట్టించాలంటే, అందులో వొకరికీ కవ్వించి, వూరుకుంటే, వొక్కొక్కప్పుడు ప్రయోజనం సిద్ధించకపోవచ్చు.

అంచేత వుభయులలోనూ కలతలు పెంచాలి.

కరంతుగారిలా అంటున్నారు.

"ఆంధ్రదేశమునందు చాలమంది తమిళులు ప్రభుత్వోద్యోగులుగా నున్నారు. వారికి ఆంధ్రులపైని సానుభూతి యుండదు"

ఈసంగతి, యీకరంతుగారి కంత అవసరమా ?

అయితే, మన దేశంలో కన్నడులు మాత్రం ప్రభుత్వోద్యోగాలలో లేరూ ?

మరి వారి మాట యేమిటీ ?

ఇందులో వున్న కిటుకేమిటంటే ?

ఇది "మీ సంపద అంతా కొల్లగొడుతూ, అరవలు మిమ్మల్ని పైకి రాకుండా అణచివేస్తున్నా"రని మనల్ని రెచ్చగొట్టడం.

ఇలాగ, కరంతుగారు, చెన్నపట్నం పేరుచెప్పి అరవలను మనమీదికీ, ప్రభుత్వోద్యోగాల పేరు చెప్పి మనల్ని అరవలమీదికీ వుసికొలుపుతున్నారు.

దీనివల్ల వారు కోరే ఫలం యేమిటంటే ?

కన్నడులకూ మనకూ బళ్లారి జిల్లాలో కాడిగట్టు దగ్గిర తగువు పెరిగివున్నది.

కన్నడులు, ఆజిల్లాలో వున్న కొన్ని అచ్చతెనుగు తాలూకాలు ఆక్రమించుకోవాలని చూస్తున్నారు.

అక్కడ ధర్మం మనది. పట్టుదల వారిది.

ఏదో విధంగా పరస్థలాలు కలుపుకుంటు గాని వారికి రాష్ట్రసిద్ధి కాదు. ఉన్నది ఊడిపోకుండా చూసుకోక పోతే మనం బైరాగులం అయిపోతాం.

ప్రస్తుతం మనవాళ్లు యెంత ఔదాసీన్యం కనపరుస్తూ వుండినా, సమయం వచ్చినప్పుడు కాలు నిలవతొక్కుకోకమానరు.

నిజంగా, వొక్క కన్నడులు మాత్రమే ప్రతిఘటించి అక్కడ విజయం పొందలేరు.

కనక యితర్ల సాయం చూసుకోవాలి. సంగతి సందర్భాలన్నీ తెలిసివుండీ, తెలుసుకుంటు పూర్తిగా సాయం చెయ్యగలవారు అరవలు తప్ప మరెవ్వరూ లేరు.

ఇందులో యింకొక విశేషం కూడా వుంది.

అరవలకూ కన్నడులకూ సరిహద్దే లేదు. వారి వారికీ మరొకరి వల్లగా అయినా పేచీ లేమీ లేవు; కాని మనకూ అరవలకూ సరిహద్దు తగువులు చాలా చోటల మొలచి వున్నవి.

కనక, మనకు, ఒకచోట ప్రతిపక్షులైన కన్నడులు, మరొకచోట ప్రతిపక్షులైన అరవలూ మిత్రమండలిగా తయారౌతారు.

రాజకీయాలలో ప్రాతిపదికసూత్రా లయినా తెలిసివుండనివారికీ, "మాకు రహస్యాలు లే" అనుకునే వారికీ యీసంగతి నచ్చచెప్పలేము: కాని యిది యిలా జరిగితీరుతుంది.

ఆంధ్రోత్కలసమాసంఘర్షణంలో సత్యమూర్తిగారు, కరంతుగారికీ, మార్గదర్శకు లయి కూడా వున్నారు.

తమాషాలు వేసి చూస్తే, మనం లొంగిపోవడం అంటూ వచ్చిందంటే బళ్లారిదగ్గిర కంటె మద్రాసు దగ్గిర అపాయం యెక్కువ సంభవిస్తుంది. కనక, మన దృష్టి అంతా అక్కడ కేంద్రీకరించవలసి వుంటుంది. దొరతనంవారిలో పలుకుబడీ, వ్యవహారం వచ్చినప్పుడు నిక్కచ్చిగా వుండడమూ, వైరాగ్యం అనే పాడు ధర్మాన్ని పుస్తకాలు దాటి సంఘంలో ప్రవేశించకుండా చేసుకునే యోగ్యతా అరవలలో యెక్కువగా వుండడంవల్ల కూడా మద్రాసుదగ్గిర మనశక్తిని పుంజీభవింప చెయ్యవలసి వుంటుంది.

పైగా, మద్రాసుదగ్గిరా, బళ్లారిదగ్గిరా ఆంధ్రదేశపు సరిహద్దులు నిర్ణయించుకోవలసిన సన్నివేశమే సంభవిస్తే ఆంధ్రోత్కలసీమ దగ్గిర కూడా వ్యవహారం అంతా తిరగతోడవలసి వుంటుంది. మధ్యరాష్ట్రాల సరిహద్దు దగ్గిరానున్నా కొంచెం లావాదేవీలు సరిచూసుకోవలసిన అగత్యం యేర్పడుతుంది.

ఇలాగ, యిదివరకే జయశీలు రయి వున్న వోఢ్రులే కాకుండా, మన తెనుగును చంపేసి, యిక్కడ, హిందీని ప్రవేశపెట్టాలచి చూస్తూ, యిదివరకే దండయాత్ర ప్రారంభించి వున్న మధ్యరాష్ట్రాలవారు కూడా మనకు ప్రతిపక్షకోటిలో చేరతారు.

అంతే కాదు. వారంతా మిత్రు లవుతారు. అన్యోన్యసహకారంతో సరుగుతూ నాలుగువేపులా ముసురుకుంటారు.

ఇలాంటి స్థితి సంభవించినప్పుడు బళ్లారి దగ్గిర కన్నడులు అసహాయశూరులై విజృంభించవచ్చు కాదూ?

కరంతుగారి ప్రయత్నం, మనకు, ఇలాంటి విషమపరిస్థితులు తెచ్చి పెట్టడానికి.

ఇంత దూరదృష్టితో—ఇలాంటి ఆలోచనతో—ఇంత గడుసురాజకీయ వచ్చారు కరంతుగారు.

కరంతుగా రుపయోగించింది పూలదండ కాదు. ముకుందగిరిబల్లెం.

అయితే: కరంతుగారిని, వొకందుకు, మేము చాలా చాలా ప్రశంసిస్తున్నాము.

కరంతుగారు కాంగ్రెస్సు మెంబరు.

ఎం. ఎల్. ఏ.

ఒకానొక మంత్రికి పార్లమెంటరీ శెక్రటరీ.

రాజగోపాలాచారిగారి నాయకత్వాన్ని శిరసావహిస్తూనే వున్న "పెద్దమనిషి"

అయితే యేం? ఆయన కన్నడరక్తం వుబికింది. వెళ్లి సభలో వాలారు. కర్నాటకరాష్ట్రప్రస్తావనవచ్చింది.

ఇక చెప్పడానికేం వుందీ?

కరంతుగా ఉండుకున్నారు.

"ఇప్పుడు చాల రాష్ట్రములలో కాంగ్రెసుమంత్రివర్గము లేర్పడినను భాషలను బట్టి రాష్ట్రములను విభజింపకపోవుట చాల విచారకరం" అని మంత్రులమీద తిరగబడ్డారు. "కాంగ్రెస్సురాష్ట్రములలో సంస్థానములను చేర్చగూడదని యిటీవల భారతకాంగ్రెస్సుకార్యసంఘసభవారు తీర్మానించిరి. ఇది మంచిపద్ధతి కాదు" అని కాంగ్రెస్సుపెద్దలను నిరసించారు. "ఇప్పుడు కర్ణాటకులకు సంబంధించిన విషయములు సన్నిటిని తెలుగులును ఆంధ్రులునే పరిష్కరించుచున్నారు" అని అసమ్మతి వెల్లడించారు. కర్ణాటకరాష్ట్రం యేర్పడితే ఆదాయం మూడుకోట్లు వుంటుంది. అయినా "ఆదాయవ్యయములు సరిపోవు నని నేను గట్టిగా చెప్పగలను" నని బుకాయిస్తున్నారు. కర్ణాటకరాష్ట్రంలో రెండుమూడు జిల్లాలు మాత్రమే వుంటవి. కాని "ప్రదేశము చాల విశాలము" అని దబాయిస్తున్నారు. జనసంఖ్య ... లక్షలకు మించదు. అయినప్పటికీ "జనసంఖ్య ఎక్కువ" అని ... ప్రగల్భాలు కొడుతున్నారు. "ఆంధ్రమును కర్ణాటకమును ప్రత్యేకరాష్ట్రములుగా చేయకపోవుటకు కేవల కారణమును కనబడదు" అని "రాష్ట్రములలో సంస్థానములను గూడా చేర్చవలెను. ఈ విషయమున నేను శక్తివంచన లేకుండ పనిచేసెదను" అని, "ప్రత్యేక కర్ణాటకరాష్ట్రమునకు బొంబాయి గవర్నమెంటు ప్రతికూలముగా నుండుటకు స్వార్థపరత్వమే కారణముగా తోచుచున్నది" అనీ వుమియుతున్నారు.

ఏదీ, ఆంధ్రకాంగ్రెస్సు ఎం. ఎల్. ఏలకు ఇలాంటి స్వాభిమానం యేదీ? ఎంత తక్కువయినా మనలో మంత్రులు కూడా వున్నారే? వారికేనా యీ ధైర్యం యేదీ?

బెజవాడ ఆంధ్రసభలకు ఎంతమంది కాంగ్రెస్సు శాసనసభవారు వచ్చారూ? రాకపోవడానికి, అవతల, వారు చూపించిన ప్రయోజకత్వా లేమిటీ?

ఇలా మాట్లాడినందుకు రాజగోపాలాచారిగారు కరంతుగారి వుద్యోగం వూడగొట్టేస్తారా? పటేలుగారు కాంగ్రెస్సువలయంలోనుంచి వారిని తోసేస్తారా?

స్వవిషయం వచ్చినప్పుడు కూడా తక్కువనుకుండా వ్రాసుకున్నందుకు మనవారికి పదవులలో యేమయినా పెంపు చెయ్యబడ్డనా?
మాట్లాడితే కాంగ్రెస్సుకిష్టంగా.
అని ... తెలుగువాళ్ళకోసమే పుట్టించా?

తెలుగువాడికి మరి గతి లేదా?

అదియేమిటో సిద్ధాన్నము వున్నదో ఆ ... తినిగినేస్తారా, హింసిస్తూ, అశాంతినీ, అసత్యాన్నీ అని పూర్తిగా నెత్తిగొట్టి వున్నది. గతించిన కొద్ది సంవత్సరాల అనుభవమూ పరిశీలిస్తామా, దాని సహగా అనేకులు ప్రతిష్ఠ లయిపోయారు. అనేకులు చావుదెబ్బలున్నా తిన్నారు. పోనీ, ప్రస్తుతం జరుగుతూ వున్నది గమనిస్తామా, అది చేసిన పడే టప్పటికే మహాత్మ్యకీయులు నండి చూస్తున్నారు. దాని పుట్టుపూర్వోత్తరాలు విచారణ చేస్తామా, అది గాంధీల సమిత్వం మాత్రమే పుట్టిన బందారిపాట. దాని నైజాన్నిగతి పరీక్షిస్తామా, ... ప్రయోగించే స్వభావం వున్న దని అంగీకరిస్తూ కాంగ్రెస్సువారే దాని కాళ్ళు చేతులు కట్టి పోపెట్టారు.

అలాంటి దేశద్రోహం అంటూ "నే నాంధ్రు" డ్నని సగర్వంగా చెప్పుకోవలసిన స్వర్గీయ సాంబమూర్తిగారు అంత వ్యామోహపడడం యెందుకూ?

వారిని కాంగ్రెస్సు, ఆదేశించలేదే? తక్కిన ఆరు రాష్ట్రాలలోనూ సాంబమూర్తిగారి కేమాత్రమూ తీసిపోని కాంగ్రెస్సువారికి దాని ముగింపు అయినా స్మాష్టం లేదే? స్పీకర్లు సభలో కూడా, పదగొండింటా వారే గాని, బొట్టూ కాటుకా పెట్టి దాన్ని ఆదరించిన వారు లేకపోయారే? సుబ్రహ్మణ్య ... అసెంబ్లీలో అయినా "మేము హిందువులము" అని అబ్దుల్ హమీద్ ఖానుగారు ప్రతిఘటించినప్పుడు, నిరంకుశంగా తామే వారి సభ్యులకి పంపియ్యవలసివచ్చింది గాని, గడ్డకట్టిపోయిన అంత మంది కాంగ్రెస్సుయోధుల్లోనూ "మా కద వుంచి తీరా" లనగలిగిన మొనగాడొక్కడూ లేకపోయాడే?

దీనివల్ల నయినా సాంబమూర్తిగారు ఔచిత్యం గ్రహించుకో లేకపోడం యేమి బాగున్నదీ?

లేక, కాంగ్రెస్సుకే చెందిన వొకానొక ముస్లిం యువకుడు స్పీకరయి, తోటి సభ్యులు గుక్కతిప్పుకోడాని కయినా అవకాశం లేకుండా తమ లాగే తన స్పీకరు హోదా చెలాయిస్తే తమ స్థితి యెలా తయారవుతుందో సాంబమూర్తిగారు వూహించి తెలుసుకో గలరా?

పాటకచేరీ పూర్తి అయిన తరవాత, రాజగోపాలాచారిగారు కలగజేసుకుని చేసిన సర్దుబాటు, తమ యెడల నిరసనగా పరిణమించి వుండడం సాంబమూర్తిగారు యిప్పటికి కయినా తెలుసుకోగలిగారా?

ఆసందర్భంలో రాజగోపాలాచారిగా రుచ్చరించిన మాటలు మాత్రం యేమి సందర్భంగా వున్నవి?

"ప్రార్థన సభాకార్యక్రమమున నొక భాగము కాదు. సభాకార్యక్రమము ప్రారంభమగుటకు ముందు ప్రార్థన జరుగును. ఇష్టమైన సభ్యులందు పాల్గొందురు. ఇష్టము గానివారు బయట నుందురు" అన్నారు వారు.

ప్రార్థన కార్యక్రమంలో వొక భాగం కాకపోతే అసెంబ్లి హాల్లో, కార్యక్రమం ఆపుచేసి అది జరపడానికి స్పీకరుగారికి యేమి అధికారం వున్నదీ.?

పోనీ, శ్రీమతి లక్ష్మీశంకరయ్యగారికంటేనూ, శ్రీయుత బులుసు సాంబమూర్తిగారికంటేనూ ముందు వచ్చి, తెర వేసి, నలుగురు అయ్యంగార్లు పాశురాలు ప్రారంభిస్తే? లేక, అంతకంటే ముందుగా వచ్చి, సనాతనధర్మవాదు లిటు నలుగురూ అటు నలుగురూ నిలిచి, తారస్థాయిలో ఘనాపాఠంతో స్వస్తి ప్రారంభిస్తే? అంతకంటే ముందుగా వచ్చి ముస్లింయువకులు ఖొరాను పఠనం ప్రారంభిస్తే? ప్రారంభించడమే కాకుండా కార్యక్రమానికి వేళ దాటి పోయినా అది ముగించకపోతే? అప్పుడేమిటి చెయ్యడం? "ఇష్టంలేనివారు బయట వుండవచ్చు" నని తామే సాయించిన ధర్మసూత్రం యీస్పీకరుగారూ, రాజగోపాలాచారిగారూ శిరసావహించి వూరుకోవలసిందే కాదూ?

సాంబమూర్తిగారి పట్టుదల యెంతమాత్రమూ ప్రశంసాపాత్రం కాదు. అది పూర్తిగా హద్దు దాటి పోయింది. వారు ప్రతిష్ఠకోసం పాకులాడుతున్నారని పసిపిల్లలకు కూడా బాగా తెలిసిపోయింది.

ప్రతిష్టంభనం ప్రారంభించిన హమీద్‌ఖాన్ ప్రభృతులైన ముస్లిములు ప్రార్థన అంటే వైముఖ్యం కలవారు కారు. నిజంగా ప్రార్థన విషయంలో, ఆముస్లిములను చెప్పిన తరవాత సాంబమూర్తిగారి పేరయినా చెప్పడానికి వీలులేదు. "ప్రార్థన కిష్టము లేనివారు బయట నుండవచ్చు" నని సాంబమూర్తిగారనడం చూస్తే, వారికి, ప్రార్థన అంటే యేమిటో సమ్యగ్బోధ కలిగి వున్నట్టు చెప్పడానికి అవకాశం కనపడదు.

ప్రార్థన! ఎవరు వద్దంటారూ? దేవుడున్నాడని వొప్పుకునేవారి కందరికీ యేదో వొక విధమైన దేవుడుండనే వున్నాడు. వారెవరూ ప్రార్థన నిరాకరించరు. దేవుడు లేడూ? దేశమాత వున్నది. లేదా? ప్రభువు వున్నాడు. ప్రార్థన వారికిన్నీ అవశ్యకమే. ఇక "ప్రార్థన కిష్టము లేనివారు బయట నుండవచ్చు" ననే మాటకి అర్థం యేమిటి?

ఇలాగ, యెటు చూసినా, సాంబమూర్తిగారి నిశ్చయం నిరాకరణానికి మాత్రమే పాత్రంగా వున్నది. ఏమీ సందేహం లేదు. అందులో తర్కం లేదు. న్యాయం లేదు. సౌజన్యం లేదు. ధర్మం లేనే లేదు.

లేని చోట, అది నిప్పు పుట్టిస్తుంది. ఉన్నచోట నిప్పుమీద నెయ్యి పోస్తుంది.

ఇంతకీ: తెనుగువాడికి బంగాళీపాట తప్ప మరి గతి లేదూ?

మంత్రాంగం బెడిసికొట్టింది

అండమాను ఖైదీలనే విడిచిపెట్టడాని కంగీకరించిన గవర్నరు రాజప్రతినిధిగార్ల సద్భావాన్ని, బేహార్, యు. పి. కాంగ్రెస్సు మంత్రు లెందుకు శంకించాలీ?

ఇంతవరకూ విడిచిపెట్టబడ్డ ఖైదీలవల్ల కాని, వారిని పురస్కరించుకుని మరి వొకరివల్ల గాని యెలాంటి అల్లరీ

జరిగి వుండనప్పుడూ, ఇక ముందు కూడా అల్లర్లు జరక్కుండా వుండడానికి మేము పూచీ పడుతున్నామని, మంత్రులు, నిక్కచ్చిగా శపథంపట్టి చెబుతూ వున్నప్పుడూ గవర్నరు రాజప్రతినిధిగార్లు వారి నెందుకి నమ్మకపోవాలీ?

ఇవి తేలవలసిన ప్రశ్నలు.

ఉభయపక్షాలవారూ పెద్దపెద్ద ప్రకటనలే చేశారు; కాని యెవరూ యిదమిత్థ మని స్పష్టంగా చెప్పినట్లు లేదు. ఆప్రకటనలు అసమగ్రా లని స్పష్టంగా తెలిసి పోతున్నది. తెరల వెనక చాలా పెద్దపెద్ద గొడవలే వున్నట్లు నిశ్చయపడిపోతున్నది.

పేచీలో ప్రశ్న ఖైదీలు చాలా కొద్దిమంది. అల్లరి చెయ్యడానికి—శాంతిని భంగపరచడానికి వాళ్ళకు చాలంత వొప్పుకుంటాము. అయితే; భారతసర్కారి సాహసనంపత్తి తక్కువగా వున్నదా? డిల్లీలో పెదవులు మెదపి, ట్రంకుటెలిఫోనుద్వారా సేతువు మొదలు శీతాచలం దాకా మూడు నిమిషాలలో ఆర్డర్లు అందచెయ్యవచ్చునే? ఎక్కడికి పడితే అక్కడికి ఎయిరోప్లేనులమీద ఒక్క గంటలో సైనికులను దిగుమతీ చెయ్యవచ్చునే? పావుగంటలో అరిదండాలు వేసి విద్రోహులను కారాగారాలలో ప్రవేశపెట్టవచ్చునే? మొదట 144—అదీ చాలకపోతే మార్షల్ లా—ఏమి లోటు? ఇలాంటి పరిస్థితులు వస్తాయో రావో యెందుకు కాస్త పరకాయించకూడదూ?

నిజంగా అల్లర్లు జరిగితే కాంగ్రెస్సు అశక్తత అంతా వెల్లడి అయిపోతుందే? దానికి నామరూపాలు లేకుండా పోతవే?

ఎందు కింత తొందరా?

ఇది గవర్నర్లు తెచ్చిపెట్టిందన్నీ కాదు. ఇది వైటుహాలు దాకా వెళ్లింది. లండను దాకా వెళ్లడం అంటూ వస్తే వైటుహాలులో చదికిలబడి వూరుకుంటుందా? అక్కడి అధికార్ల దృష్టి కేవలమూ భారతదేశానికి మాత్రమే సంబంధించి వుండదు. ప్రపంచకం అంతటా బాలెన్సు నిలుపుకోవలసిన బాధ్యత వారిది.

మరిన్నీ యిది, యిటు, మంత్రులే తెచ్చిపెట్టిందీ కాదు. రాష్ట్రీయకాంగ్రెస్సుసంఘాలలో కూడా యిది జరిగింది. అక్కడితో ఆగిలేదు. అఖిలభారతకాంగ్రెస్సుసంఘం దాకా వెళ్లింది. కాని దానికి వ్యక్తిత్వం లేకపోవడంవల్ల—జీవనాడి దృఢంగా లేకపోవడంవల్ల గాంధిగారి దాకా వెళ్లింది. తమ బాధ్యత చాలా గొప్పది అని యెరిగి వుండిన్నీ, తమకు తోచినట్లు మాత్రమే పని చేసే స్వభావం వారిది.

ఇంతకీ :

బెహారులో కాంగ్రెస్సు వ్యవహారా లేమీ బాగా లేవు. సమయం వస్తే, కాంగ్రెస్సుకు, కిసానులంటే యెంత చిన్నచూపో అక్కడ తెలిసిపోయి వుంది. యూ. పీ.లో కార్మికుల విషయంలో కూడా కాంగ్రెస్సు సవతితల్లి ప్రేమ వెల్లడిఅయిపోయింది. సోషలిస్టులూ, కిసానబంధువులూ సహించలేకపోయారు. ఎన్నికల ప్రణాళిక విషయం అక్కడ తర్జనభర్జనకు పాల్పడింది. మంత్రులకు అధికార్ల కింద మాటలు లేచాయి.

“హరిపురం కాంగ్రెస్సులో మంత్రులు చేసిన పనులన్నీ చర్చకు వస్తాయి. రాజకీయఖైదీల అందరి విడుదలకు ప్రయత్నిస్తాము అని యెన్నికల సమయంలో వాగ్దానం చేశాము. ఎందు కింకా చెయ్యలేదు అని హరిపురం కాంగ్రెస్సులో అడిగితే యేమిటి చెప్పడం?”

పంతుగారి ప్రకటనలో భాగం యిది.

ఏమిటి దీని భావం?

వెనక జర్మన్ మంత్రి చెప్పినట్లు, కాంగ్రెస్సువారి యెన్నికల ప్రణాళిక, నిజంగా యిప్పుడు “స్క్రాప్ ఆఫ్ పేపర్” కాంగ్రెస్సు ప్రముఖులకు దానిమీంద లక్ష్యమే వుంటే సోషలిస్టులు ఇంత చెలరేగవలసిన అగత్యం యేమీ లేదు. మరిన్నీ, కాంగ్రెసుమంత్రులకు, నిజంగా దాన్ని అమలుపరుస్తానే వుంటే, “ఆశపథాలు మేము తీర్చుకుంటున్నా” మని మాటిమాటికీ చెప్పుకోవలసిన అవసరమే లేదు. చేసే వుంటే జరిగివున్నదాన్ని వారెవరు చెప్పకుండా ప్రజలే గుర్తించగలరు. ఇక్కడి సోషలిస్టులు పరప్రత్యయనేయబుద్ధులు కనక కాంగ్రెస్సుకి పోటు

చేసిన దేశీయులకు యథార్థపరిస్థితులు తెలవకుండా వున్నవి. బేహారులోనూ, యూ. పి. లోనూ యిలా కాదు. అక్కడి గాంధిస్వయంగా [illegible] వున్నాడు. వారు ప్రజలలో మంచి ప్రబోధం చేస్తున్నారు. అంచేతనే రాజేంద్రప్రసాదుప్రభృతి కాంగ్రెసుప్రముఖులు, అక్కడ, తమ నిరంకుశస్వభావాన్ని వెళ్ళకక్కవలసి వచ్చింది.

పోతే పతా?. హరిపురం కాంగ్రెసులో రాజకీయ ఖైదీల మాట ఎక్కువగా రాలేదు. ఎన్నికల ప్రణాళిక అంతటిని గురించి వస్తుంది. మంత్రులు దాని కేం చెబుతారూ? మెల్లి మెల్లిగా ఆచరణలో పెడుతున్నా మని చెప్పక తప్పదే? ఖైదీలవిషయం మాత్రం అలా యెందుకు చెప్పగూడదూ? ఎన్నికలకు ముందు "ఖైదీలను మాత్రమే ముందు విడిచిపెడ్తాం" అని శపథం పట్టలేదే? పైగా, ఇప్పటికి విడుదల చెయ్యబడ్డ ఖైదీల సంఖ్య చిన్నది కాదే? ఖైదులో వున్నవారి సంఖ్య పెద్దది కూడా కాదే?

యూ. పి. లో మిగిలి వున్న పదిహేనుగురు ఖైదీల విషయంలో కూడా వ్యక్తుల అర్హతలను పరిశీలించి, కొందరిని కొందరిగా విడుదల చెయ్యడానికి గవర్నరు ఒప్పుకున్నట్టు పంతులుగారే చెబుతున్నారే? దాని నంగీకరించడానికి తామున్నూ సిద్ధంగానే వున్నట్టున్నూ పంతులుగారే చెబుతున్నారే?

ఇక యీ పేచీ యెందుకు రావాలి?

కొంచెం సూక్ష్మవిచారణ చేస్తే యిక్కడ కిటుకు బోధపడుతుంది.

అదేమి టంటే?

దాక్షిణ్యం చేసిన ఖైదీలలో పదిమందిని, గవర్నరుగారు ఆగష్టులో విడుదల చేయించారు. మంత్రు లప్పటికి తృప్తిపడి, కొన్నిరోజులు గడిచాక మళ్ళీ కోరారు. దానిమీద, గవర్నరుగారు, అక్టోబరులో మళ్ళీ అయిదుగురిని విడుదల చేయించారు. ఆఅయిదుగుర్నీ విడుదల చేయిస్తూ మాత్రం, వారు, "ఇక యింతకన్న యెక్కువ మందిని విడిచిపెట్టడానికి వీలు లే" దని ఖచితంగా చెప్పారు. మంత్రు లప్పటికి వూరుకున్నారు.

ఇక మిగిలిన ఖైదీలు పదిహేనుగురు. వచ్చిన తగువంతా వీరి విషయంలోనే.

జనవరిలో మంత్రులు మళ్లీ కొసరడం ప్రారంభించారు. వారిలో యేవుగురి నయినా విడిచిపెట్టవలసిం దని పదే పదే కోరసాగారు. దానికి, గవర్నరుగారు తాము ఖచితంగా నిషేధించి వుండినీ, "అందర్నీ ఒక్కమారుగా కాకుండా, వ్యక్తుల అర్హతలను పరిశీలించి అర్హతాభేదములను బట్టి ముందు వెనుకలుగా వదల" డానికి అంగీకరించారు. ఈసంగతి పంతులుగారే అంగీకరించి వుండడం పైన చూచి వున్నాము.

అంటే యేమిటి?

ఇక యెవరినీ విడిచిపెట్ట నని ఖచితంగా చెప్పి వుండినీ, గవర్నరుగారు అదే పట్టుకుని బిగించుకు కూర్చోలేదు.

కాని యీ మాట మంత్రుల ధోరణి మారింది. పంతులుగారే యిలా అంటున్నారు.

"అర్హతను నిర్ణయించే అధికారమూ, ఎప్పుడు ఎవ్వరిని వదలవలెనో నిర్ణయించే అధికారమూ పూర్తిగా మా కియ్యవలసిన దనే మేము కోరాము. అంతేగాని మంత్రులే కాని గవర్నరు నిర్ణయించరా దని కోరలేదు"

ఈఅధికారం యెవరిది? మంత్రుల చేతే ప్రపంచం తల్లకిందు లయిపోదు. నిజానికి, పంతులుగారివంటి సమర్థులు ఈమాత్రం బాధ్యతను చక్కగా నిర్వహించుకోలేకపోరు. ఇది మంత్రులకు విడిచిపెడితే గవర్నరుగారు అసమర్థు లనీ అనిపించుకోరు.

కాని వున్న దల్లా యేమి టంటే?

పంతులుగారు చేతులు కాలిన తరవాత ఆకులకోసం తడుముకున్నారు. దీన్ని పట్టిచూస్తే యీవ్యూహం వారికి తట్టిందిగా కనపడదు.

ఎన్నికల ప్రణాళికకూ, మంత్రుల కార్యక్రమానికీ యేమీ సమన్వయం లేకపోయింది. ప్రజల విమర్శలు జోరయిపోయాయి. సోషలిస్టుల తొందర యెక్కువ అయిపోయింది. ఇక మంత్రాంగం విడిచిపెట్టి యివతలికి రావాలి. తప్పదు. అందుకోసం యెత్తిన యెత్తిది. ఇది

పంతులుగారికి స్వయంభువు కాదు. కాంగ్రెస్సు గుడారంలో నుంచి ఆజ్ఞాపూర్వకంగా వచ్చింది.

పంతులుగారు ఇందులో వున్న అసందర్భం గుర్తించలేని వారు కారు; కాని యెదురుచెప్పడానికి వల్లకాదు.

అర్హతను నిర్ణయించే అధికారమూ, ఎప్పుడు ఎప్పుడు విడిచి వదలవలెనో నిర్ణయించే అధికారమూ అగష్టులో గవర్నరు చెలాయించలేదూ? అక్టోబరులో కూడా గవర్నరే చెలాయించలేదూ? పంతులుగారు ఊపిరుండగా అప్పుడే యెందుకు అడగలేదూ? ఈ అధికారం తనకి కావాలని—తమకే వుండాలని—తమదే అని అప్పుడే యెందుకు నిక్కచ్చిగా చెప్పలేదూ? అలా చెయ్యకపోవడంవల్ల, అది, గవర్నరుగారే చెలాయించ తగ్గదనే సంప్రదాయం ఏర్పడిపోలేదూ? స్థిరపడిపోలేదూ?

ఈసుడిగుండంలో, మంత్రులు, యోగక్షేమాలను పట్టుకుని బైటపడదామని చూశారు. కాని లాభం లేకపోయింది.

బీహారులో కూడా యిలాంటివే తటస్థించాయి.

అందరూ రాజీనామా లిచ్చేశారు.

ఎలాగైనా మంత్రిపదవులు విడిచిపెట్టడమ్మాత్రం అనే తహతహ తప్ప యిందులో మరేమీ లేదు.

పోగా,

ఇక్కడ మరొక్క సంగతి కూడా ఆలోచించవలసి వుంది.

జైలులో వున్న ఖైదీలు నిజంగా దౌర్జన్యం చేసి వుండవచ్చు; కాని అవి నేరంచేస్తే కాని దానికి ప్రేరకాలైన కారణాలు తుచ్ఛాలూ, నీచాలూ కావు. స్వరాజ్య సంపాదనవాంఛ తప్ప అందులో మరొక క్షుద్రవాంఛ లేదు. వారు, వుద్రేకచిత్తులైనవారు కావడంవల్లనే అలాంటి దుడుకుతనానికి సాహసించారు; కాని బాగా ఆలోచించి కాదు. ఇక యిప్పుడు. ప్రభుత్వంలో స్పష్టమైన మార్పులు వచ్చాయి. రాష్ట్రీయస్వపరిపాలనాధికారం దేశీయులకిచ్చామని బ్రిటిషువారే అంటున్నారు. కనక పరిస్థితులు పూర్తిగా మారాయి. ఆఖైదీలు, ఏకారణాలవల్ల అనార్జవాలు చేశారో ఆకారణాలు ఇక వుండవు. ఉండినా అంత వుద్రేకం కలిగించవు. వారి బుద్ధికి కొంత, సంస్కారం కూడా యేర్పడింది. అందుచేత, వారు, దౌర్జన్యం చెయ్యడానికి యిక సిద్ధపడరని నిష్కర్షగా చెప్పవచ్చు. లా—అండ్—ఆర్డర్ను కాపాడవలసిన స్వతంత్రత తమ వారికి సంక్రమించింది కనక కూడా, వారు, దౌర్జన్యం మానుకోవలసిన ఆవశ్యం పూర్తిగా యేర్పడ్డది.

ఇలాగ, ఆకాలము, ఆప్రభుత్వము, ఆకారణాలు మారిపోయినప్పుడు, ఇంకా, అవిన్నీ తెలుసుకొండాలి ?

రాజకీయఖైదీలను పూర్తిగా విడిచిపెట్టాలని కాంగ్రెస్సువారికి కలిగిన ఉత్సాహమూ, మనము, యీవిధంగా స్వాతంత్ర్యపూర్వకంగా సమర్థించగలము; కాని మద్రాసు మాటేమిటి ?

రాజకీయఖైదీలను విడిచిపెట్టే అధికారం లేకపోయిందని బీహారు, యూ. పీ. మంత్రులకు రాజీనామా లిచ్చేసి, వచ్చెయ్యండని ఆజ్ఞాపించిన కాంగ్రెస్సుప్రముఖులు, రాజకీయఖైదీలనే సృష్టించిన మద్రాసుమంత్రులను [illegible] యెలా వూరుకున్నారూ ?

కాంగ్రెస్సువారికి, బీహారు, యూ. పీ. మంత్రుల చర్య యుక్తస్ఫూర్తిమూ, మద్రాసుమంత్రుల చర్య సమయస్ఫూర్తిని మెచ్చు. మద్రాసుమంత్రుల చర్య యుక్తస్ఫూర్తిమూ, బేహారు, యూ. పీ. మంత్రుల చర్య తీవ్రనిరసనం.

మంత్రుల రాజీనామాలకు కారణం యిదన్నమాట

“ మీ ప్రత్యేక చర్యను ఇక్కడ ప్రదర్శించవద్దు. మిమ్ము కొన్నేండ్లనుంచి సహించుచున్నాము. ఇక ముందు సహించజాలము. మీకు తగిన శాస్తి చేయగలము ”

ఇవి పటేలుగారి సింహగర్జనలు.

వారి “ ప్రతివాద (?) భయంకరత్వా”నికివి విజయధ్వజాలు.

హరిపురం కాంగ్రెస్సు విషయనిర్ణయసభలో, బేహార్, యూ. పీ. మంత్రుల రాజీనామాలను పురస్కరించుకుని, పటేలుగారు, గాంధిగారు తయారు చేసిన తీర్మానం

సాంతంగా ప్రతిపాదించి, దానిమీద రేగిన చర్చలో సోషలిస్టులను వుద్దేశించి ఇలా గర్జించారు.

"అంతట అతివాదవర్గమువారు కోపముతో కేకలు వేసి, లేచి మాట్లాడ దలచగ, పటేలు అనుకూలురు అంతకన్న యెక్కువగ అరచి కూర్చోపెట్టిరి"

సోషలిస్టులు (అతివాదవర్గంవారు) దీనికేం చెబుతారో వినాలనీ, దీనిమీద యేం చేస్తారో చూడాలనీ మాకేమీ ఆదుర్దా లేదు. ఏమంటే? ఆ అతివాదులూ, అమితవాదులూ కూడా నాకే (కాంగ్రెస్సు) నిలయంలో సమవృష్టి లయి వున్నారు. ఇలాంటి తూలుమాటలు దానికనుకూలం అయినా, ప్రతికూలం అయినా యిగి తెగిలవాని కూడా యున్నై పెద్దు గ్రంథు కోసం తంటాలుపడుతున్నవారు; కనక వారిలో వారే అవిషయం సరి చూసుకుంటారు.

ఇది వున్న దల్లా యేమి టంటే?

కాంగ్రెస్సు శాంతపద్ధతులలోనే నమ్ముస్తూ వుండనే వారికి, ఈమాటలు, కొంచెం పరిజ్ఞానం కలిగిస్తాయి. గివర్నమెంటుకూడా, ఆర్డినెన్సుమీద ఆర్డినెన్సు ప్రయోగించి, దేశం అంతటా లాటీవిహారం చేయించి, కాంపు జెయిళ్లను కూడా యేర్పాటు చెయ్యవలసివచ్చినప్పుడు, ప్రతిపక్షులను గురించి బహిరంగంగా యింత తీవ్రభాష వుపయోగించలేదు.

బహుశా గాంధిగారి సమక్షంలోనే యివి ఉచ్చరించబడి శంకుస పోసిన తీర్థాలయి వుంటాయి.

అయితే: పటేలుగారు ఇంత వుద్రిక్తు లయిపోడానికి కారణం యేమిటి?

ఇదీ యిక్కడ ప్రశ్న.

వచ్చిన ఘట్టమునకు అంతా యేమి టంటే?

పటేలు అనుకూలురు పూర్తిగా మంత్రిపదవీ ముగ్ధు లయి వున్నారు.

సోషలిస్టులు పూర్తిగా మంత్రిపదవీవిముఖు లయి వున్నారు.

కాని, ఉభయులకూ కాంగ్రెస్సువేదిక యేకపీఠం.

వివాహబంధం ఇంకా దృఢంగానే వుండినా, ప్రత్యే కాశయాలతో—ప్రత్యేక సంకల్పాలతో—ప్రత్యేక కార్యక్రమంతో—ప్రత్యేకప్రాప్యాలకోసం ప్రవృత్తులై, ఉత్సాహవ్యగ్రులై వున్న దంపతుల స్థితి యిది.

దీనివల్ల యేం జరిగింది?

బేహార్‌లో కర్షకులు తీవ్రవ్యవసాయం ప్రారంభించారు.

యూ. పీ. లో కార్మికులు ప్రత్యక్షకర్మ ప్రారంభించారు.

సోషలిస్టులను గురించి, పటేలుగారు "సంయుక్త రాష్ట్రములందు అట్లు (సమ్మెలు కట్టించడం) చేసి కార్మికుల స్థితి చాల దీనస్థితికి తెచ్చిరి" అన్నమాటలే దీనికి ప్రత్యక్షనిదర్శనం.

మరిన్ని, ఈచర్చాసందర్భంలో, సోషలిస్టుల వైఖరి స్పష్టపరుస్తూ, మసానీగారు "బీహారుసంయుక్తరాష్ట్రములం దేర్పడిన క్లిష్టపరిస్థితులకు సోషియలిస్టుపక్షము వారు కొంతవరకు బాధ్యులని కొందరు చెప్పుచున్నారు. ఇందులకు సోషియలిస్టుపక్షమువారు సిగ్గుపడుట లేదు. బ్రిటిషు అధికారమునకు కాంగ్రెసువారు లొంగిపోకుండ ప్రతిఘటించుటకు సోషియలిస్టుపక్షమువారు బాధ్యులైనచో ఇది గర్వపడవలసిన విషయము" అన్నమాటలున్నూ బలమైన సాక్ష్యం.

ఇంతే కాదు. మంత్రిపదవులను గురించి యీవుభయ వర్గాల దృక్పథములూ యీ తీర్మానపు చర్చాసందర్భంలోనే చక్కగా వెల్లడి అయినవి.

"ఎట్టి క్లిష్టపరిస్థితులైనను ఎదుర్కొని, అవసరమగు చర్య తీసికొన మనము సిద్ధముగ నుండుటచే కొంత సహనము ఇప్పుడు చూపెదము. ఈకారణమువల్లనే ఇతరరాష్ట్రములందు మంత్రులు వెంటనే రాజీనామా యివ్వవలయు నని కాంగ్రెసువారు నిర్ణయించలేదు"

ఇవి పటేలుగారి మాటలు.

"ఈరెండు (బీహార్, యూ. పీ.) రాష్ట్రములందలి గవర్నరులు తమ వైఖరిని మార్చుకొనకుండిన బ్రిటిషు ప్రభుత్వపు సవాలును అంగీకరించి ఇతరరాష్ట్రములయందలి మంత్రులు కూడ రాజీనామా యిచ్చి అసహకారోద్యమమునకు గడంగవలసియుండును. ఇంతకన్న వేరు

మార్గము లేదు. ఒక రాష్ట్రమున కాంగ్రెస్సువారు ప్రభుత్వమును ఎదిరించుట, మరికొన్ని రాష్ట్రములందు మంత్రులు పరిపాలనము జరుపుట విపరీతముగ నుండును"

ఇవి మసానీగారి మాటలు.

బేహార్, యూ. పీ. మంత్రులు రాజీనామా యిచ్చినందుకే పటేలుగారు సహించలేకుండా వుండగా, ఆరెండు రాష్ట్రాలవారు మాత్రమే రాజీనామా యిచ్చినందుకు సోషియలిస్టులు అగ్గయిపోవడం—నిజంగా యిది సుఖసుఖాల తేలిపోయే విషయం కాదని వేరే చెప్పడం యెందుకూ?

అంటే యేమి తేలుతున్నదీ?

సోషియలిస్టులు చేసే అల్లరిని భరిస్కరించుకుని, వారి ప్రోత్సాహంవల్ల ప్రజలు చేసే ఆందోళనం చూసి, బేహార్, యూ. పీ. మంత్రులు తెగే దాకా లాగారు. అదేమో రాజప్రతినిధిగారు కూడా యీసందర్భంలో తొందరపడ్డారు.

ఏది యేమయినా, యీరాజీనామాల సందర్భంలో మంత్రుల వేగిరపాటే ప్రాతిపదిక అని స్పష్టపడిపోతున్నది.

దానికి బలమైనకారణం సోషలిస్టుల వొత్తిడి.

ఇదీ సంగతి.

పత్రికాసంపాదకుల సమావేశం

"ప్రజ" పత్రికాసంపాదకులు, బోడపాటి శివరామకవి గారు, రాజమహేంద్రవరంలో, తెనుగుపత్రికల సంపాదకుల సమావేశం జరపా లని వుద్దేశించుకొని వున్నారు. స్థానికపత్రికలవా రందరూ అంగీకరించి పూర్ణసహకారం చేస్తే చాలా శీఘ్రంగానే అది నెరవేర్చాలని వారు ఉత్సాహపడుతున్నారు.

"ఎవరి పార్టీకసిద్ధాంతాలను వారు పాటించుకోవచ్చు. ఎవరి పాలసీని వారు అనుసరించుకోవచ్చు; కాని ఆంధ్రజాతీయవిషయాలు వచ్చినప్పుడు మాత్రం—ఆంధ్రరాష్ట్రనిర్మాణవిషయం వచ్చినప్పుడు మాత్రం అందరూ ఏకాభిప్రాయం వెల్లడించాలి. సత్వరాంధ్రరాష్ట్రసిద్ధికి తీవ్రకృషి చెయ్యాలి. సమయం వచ్చినప్పుడు అందరూ వీటికే ప్రాముఖ్యం యివ్వాలి" మేము గ్రహించినంతవరకూ, ఈసమావేశం జరపడంలో, కవిగారి వుద్దేశం యిదీ.

ఇందులో అనౌచిత్యం యేమీ లేదు. అస్వాభావికమూ, స్వార్థమూ కూడా యేమీ లేదు. జర్జరితమై పోయి వున్న జాతి, ఇలాంటి ప్రయత్నాలలో గాని అభివృద్ధిమార్గం పట్టదు.

ఈసంకల్పానికి మేము స్వాగతం యిస్తున్నాము. కవిగారికి మా అంగీకారమూ, సహకారసంసిద్ధతా విశదపరుస్తున్నాము.

తెనుగుపత్రికల సంపాదకు లందరూ ఈవిషయంలో తమ అభిప్రాయాలు సూచించి కవిగారిని ప్రోత్సాహపరచకోరుతున్నాము.

హరిపురం కాంగ్రెస్సు

కాంగ్రెస్సు మహాసభయొక్క యీఘట్టంలో సమావేశం దేవేంద్రవైభవంగా జరిగిందని వార్తలు.

అయి వుండవచ్చు. అందుకు ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఏమంటే? అది సంభవమే.

ముప్ఫయి లక్షల సభ్యులున్న పక్షం. ఇతరపక్షాలకంటే తమ పక్షానికే ప్రాబల్యం యెక్కువగా వుండాలని పరమోత్సాహం వున్న నియంతలు. ఆనియంతలకు తమ మీదే పరమాదర మనీ, సర్వమూ తమతోటే వుందనీ మురిసిపోయే నాయకులు. అపారమైన ధనం. అనేకభాషల్లో అనేకదైనికపత్రికలు.

పైగా, ప్రస్తుతం "ఏడు" రాష్ట్రాలలో మంత్రాంగాధికారం. దానికి తోడు ప్రాపంచికప్రవృత్తీ, రాజకీయపరిస్థితులూ అవగాహన చేసుకోలేని జనసామాన్యం.

ఏం లోటూ? ఎందరు హాజరు కావడానికయినా, ఎంత చక్కగా జరగడానికయినా, దాని వార్త లెంత త్వరగా—ఎంత దూరం వ్యాపించడానికయినా అన్నీ అవకాశాలే.

సంతోషమే.

అయితే: జనసామాన్యాని కింతకంటే యేమీ అక్కర్లేదు; కాని కాంగ్రెస్సు జరిగిందంటే పరిశీలించవలసిన సంగతులు ఇవే కావు.

ముప్పయి లక్షల సభ్యులున్నారంటే ప్రజాస్వామికత్వానికి అందులో యెన్ని అవకాశాలుండాలీ? ఎంత హృదయవైశాల్యం వుండాలీ?

ఈదృష్టితో చూస్తే,

కాంగ్రెస్సుకి, గాంధిగారి సాచివ్యం వచ్చింది మొదలు అధ్యక్షపదవిలో నామినేషనే కాని ఎన్నికలు జరగడం లేదు. ఈవిషయం మొన్నటి లక్నో సమావేశం మొదలు బహిరంగం అయిపోయింది.

ముందు, ఏదో వొక కారణాన్ని పురస్కరించుకుని, గాంధిగారు, "ఈసంవత్సరం ఫలానావారి నెన్నుకోవలసిం" దని తాకీదివ్వడం. ఆపెద్దమనిషే కాక, అప్పటికి కితరులు కూడా ఆ ఆశతో వున్నవారుంటే వారంతా విత్‌డ్రా చేసుకోవడం. అలా చేసుకోనివారిమీద ఏదో విధంగా తరవాత కక్ష సాధించడం. రాష్ట్రీయకాంగ్రెస్సు సంఘాలన్నీ ఎన్నికల తంతు ప్రదర్శించడం.

అలా ప్రకటించబడ్డ అధ్యక్షుడు, తన వుపన్యాసం తయారుచేసుకోడానికి ముందు గాంధిగారి దగ్గిరికి వెళ్లి వుపదేశం పొందడం. రాత పూర్తి అయిన తరవాత, గద్దె యెక్కడానికి ముందు వారికి వినిపించి, వుంటే సవరణలు చేయించుకోవడం.

ఇందులో యేమి ధన్మం వున్నదీ?

కార్యసంఘసమావేశం జరుగుతుందంటే—వర్కింగు కమిటీ సమావేశం జరుగుతుందంటే ముందు ప్రముఖులందరూ వార్ధా వెళ్లి గాంధిగారి సలహాలు పొంది, తరవాత సిర్ణీతస్థలాలలో తంతు నడిపి వాటిని బహిరంగపరచడం.

ఇందులో న్యాయం యేమున్నదీ?

దేవేంద్రవైభవంగా జరిగిందన్న హరిపురం సమావేశంలో సోషలిస్టుల ప్రాతికూల్యం తప్పదని మహాసభలో ప్రతిపాదించి తీర్మానించవలసిన ప్రస్తావాలు కూడా ఈసంవత్సరం గాంధిగారి సమక్షంలో కార్యసంఘమే నిర్ణయించేసింది.

ఇది మాత్రం యేమి సక్రమంగా వున్నదీ?

ఈసంవత్సరం మరొక విశేషం.

అధ్యక్షులుగా "డిక్లేరు" చెయ్యబడకపూర్వం, సుభాస్ బోసుగారు, గాంధిగారి నాయకత్వంవల్ల దేశం పూర్తిగా చెడిన దనీ, జాతి యుగయుగాలకు వెనకబడిపోయిం దనీ స్పష్టంగా పత్రికలకు రాశారు; కాని "యథాపూర్వం" గా అధ్యక్షు లనిపించుకున్న తరవాత, ఉపన్యాసవిషయాలు గాంధిగారి నడిగి నిర్ణయించుకున్నారు. తయారైన వుపన్యాసం, హరిపురంలో, ముందు గాంధిగారికి చూపించి, సవరణలు చేయించుకున్నారు.

లోకసామాన్యధర్మాన్ని బట్టి పెద్దల సలహాలూ, సవరణలూ కోరడం మంచిదే; కాని, గాంధిగారి నాయకత్వాన్ని అంతగా నిరసించిన బోసుగారికి ఇలా చెయ్యడం వ్యక్త్యపేక్షయా లోపం కాదూ?

హరిపురంలో, కాంగ్రెస్సు, గాంధిగారు కాదన్న యేవిషయం అంగీకరించగలిగిందీ? వా రుచ్చరించిన యేఅక్షరం కాదనగలిగిందీ?

ముప్పయి లక్షలమందీ ప్రయిమరీ సభ్యులుగా చేరడం, క్రమాంతరాలు గల అనేక ఎన్నికల్లో కిందా మీదా పడడం, అతివాదిమితవాదిభేదాలు పెంచుకుని నానా అల్లరీ, నానా హంగామా, నానా రసాభాసా చేసుకుని కాంగ్రెస్సు ప్రతినిధిత్వం సంపాదించుకోవడం, దుంపలుదంపలు చేసుకుని హరిపురం వెళ్లి నానా యిబ్బందులూ పడడం, అభిప్రాయభేదాలు వచ్చినప్పుడుకూడా నోరెత్తడానికి వీలులేక, కళ్లు అప్పగించి, గుటకలు మింగుతూ అతిప్రయత్నంమీద చేతు లెత్తడానికేనా?

కీర్తిశేషులమొదల సానుభూతి ప్రకటించే తీర్మానం

సందర్భంలో అధ్యక్షులవారికి కూడా ముఖపిథానం చేసెయ్యడ మేనా ?

ఇలాగ యెటు చూసినా, కాంగ్రెస్సులో వొకరిద్దరు వ్యక్తులే నిరంకుశంగా ప్రవర్తించడం జరుగుతున్నది. ప్రజాస్వామికత్వం యేమీ లేదు.

మొత్తానికి, అధ్యక్షుని వుపన్యాసంలోనూ, తీర్మానాలలోనూ గాంధిగారి యిష్టం వొక్కటే వెల్లడి అవుతున్నది ; గాని —చెలామణీ అవుతున్నది ; గాని కాంగ్రెస్సు పక్షం పేరట వొక ప్రత్యేకవలయంలో చేరి వున్న ముప్ఫయి లక్షల దేశీయుల వాణీ యెక్కడా యెంతమాత్రమూ వెల్లడి కావడం లేదు. అసలు కన పడడమే లేదు.

కాంగ్రెస్సు దేవేంద్రవైభవంగా జరిగింది.

అంతే.

యేమిటి జరిగితే ?

పెద్ద లేం చేస్తున్నారు ?

గుంటూరుకాలేజీవిద్యార్థులు సమ్మె కట్టా రంటే, అది క్రిష్టియన్ కాలేజీ కనక, తన్నిర్వాహకుల దృక్పథమూ, మన దృక్పథమూ భిన్నంగా వుండేవి కావడంవల్ల, సందిగ్ధాలైన పరిస్థితు లేవో వచ్చివుండ వచ్చు నను కున్నాము. కాని బందరు విద్యార్థు లెందుకు సమ్మె కట్టవలసివచ్చిందీ ? ఇంకా మరికొన్నిచోట్ల హైస్కూళ్ళ విద్యార్థులు కూడా సమ్మెలు చేశారు. వాటి కేం అను కోమూ ?

అన్నిటినీ మించాయి విశాఖపట్నం వైద్యవిద్యార్థుల సమ్మె, ఆంధ్రయునివర్సిటీ కాలేజీ బి. కాం. విద్యార్థుల సమ్మెనూ.

వీటి కేమిటీ సమాధానం ?

నిజంగా, అభిమానం వున్నచోట, ఇంతకంటే సిగ్గు పరిచే సన్నివేశం మరివొకటి వుండదు.

యునివర్సిటీ వే రయింది కాని, మనకి, ప్రభుత్వం వేరు కాదే ? మద్రాసు గవర్నమెంటు, ఆంధ్రయునివర్సిటీకి, మద్రాసు యునివర్సిటీతో సమాన మైన తాహతు యెందుకు కలిగించదూ ?

గవర్నరు వంటి యురేషియన్ ఆఫీసర్లకు ఇలాంటి స్వల్పవిషయాలలో ప్రత్యేకోద్దేశా లేమీ వుండవు. విశిష్టమైన పోలసీ కూడా వుండదు. పోగా, గవర్నమెంటులో పెద్దపదవు లాక్రమించుకుని వున్న మనవా రేం చేస్తున్నారూ ?

మన మద్రాసుమంత్రులు బ్రహ్మాండభాండం వారగతోసేస్తా మని ప్రణాళికలు ప్రకటించిన కాంగ్రెస్సు వారు కాని జస్టిస్సువారు కారు. వీరి కేనా యేడో మాసం దాటింది కాని అధికారం చేతికి వచ్చి యివాళా నిన్నా కాదు. పైగా, యీవిషయం యెవరూ కదపలే దేమో అనుకుంటే కానర్వొకేషను సందర్భంలో విద్యార్థులు రాజగోపాలాచారిగారికి విన్నవించుకునే వున్నారు. అంతే కాకుండా రిజస్ట్రారు ప్రకటన చూస్తే అప్పటికి చాలా రోజులు వెనకటినుంచే యునివర్సిటీ అధికారులు శ్రద్ధచేస్తున్నట్టు కనిపిస్తుంది.

అయినా యిది యెందుకిలా జరగవలసివచ్చిందీ ?

సెనేటుసిండికేటుమెంబర్లలో కూడా చాలామంది కాంగ్రెస్సుబురఖా వేసుకున్నవారే. వారిలో ఎం. ఎల్. ఏలూ, ఎం. ఎల్. సీలూ కూడా వున్నారు. వారేనా యీవిషయం శాసనసభలో యెందుకు కదపలేదూ ?

ఇంతే కాక : విద్యార్థుల తండ్రుల మాట యేమిటీ ? వారిలో కొందర్ని శుద్ధవేదజనుల కిందా, విద్యాహీనుల కిందా జమకట్టేసినా, చాలా మంది ఆఫీసర్లూ, వకీళ్లూ, వుపాధ్యాయులూ అయి వున్నారు. తమ బిడ్డల గతి వారి కేనా తోచకపోవడం యేమిటీ ?

పబ్లిక్ సర్వీస్ కమిషనులో కూడా ఆంధ్రు లున్నారు. జాతిపరంగా అయినా యీవిషయం వారు ఆలోచించవచ్చునే ?

ఇంత మంది పెద్దలు— హేమాహేమీ లుండగా విద్యార్థులా తంటాలు పడడం ? వా రయినా యిలాగ సత్రయాగం ప్రారంభిస్తేనా పెద్దలకు చీమకుట్టడం ?

ఇంత రగడ పెరగకపోతే, యీవైద్యవిద్యాస్నాతకులూ, బి. కాములూ ఎప్పటికీ గతిలేనివా రయిపోవలసిం దేనా ?

ఈవిషయాలు కూడా సంపూర్ణస్వరాజ్యం వచ్చాకే పరిష్కరిస్తారా కాంగ్రెసాంధ్రులు ?

ఆంధ్రరాష్ట్రం మాట యేమిటి?

డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు, సంస్థానప్రజల విషయంలో, పట్టుపట్టి హరిపురం కాంగ్రెస్సులో కొంత అనుకూల్యం కలిగించడం బాగానే వున్నది. కాంగ్రెస్సువల్ల కొంతయినా ప్రయోజనం కలగడం అంటూ వస్తే సంస్థానప్రజలకు కూడా ఆకొంతలో కొంత కలుగుతుంది. ఇటు హైదరాబాదు సంస్థానంలో అధికసంఖ్యాకులూ, అటు మైసూరుసంస్థానంలో కొన్ని లక్షలూ ఆంధ్రులే కనక ఈవిధంగా మనం సంతోషించవచ్చు; కాని ఆంధ్రరాష్ట్రంమాట యేమిటి?

భాషాప్రయుక్తరాష్ట్రాల సంగతి వారు కాంగ్రెస్సులో కదిపారు కారేం?

మరిచిపోయారా? అనవసరం అని తోచిందా? అవకాశం లేకపోయిందా? సాహసమే కలక్కపోయిందా?

బొంబాయి అసెంబ్లీలో కర్నాటకరాష్ట్రప్రస్తావన వస్తున్నది. మద్రాసు అసెంబ్లీలో ఆంధ్రరాష్ట్రప్రస్తావన చేసేటట్టు, డాక్టరుగారు, తమ రాష్ట్రీయసంఘాధ్యక్షహోదాలో ఆంధ్రకాంగ్రెస్సు ఎం. ఎల్. ఏ లకు విధించారా?

సందర్భం చూడగా, రెండోమాటు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్సు సంఘాధ్యక్షత సిద్ధించడం తోటే, వారికి, ఆంధ్రరాష్ట్రప్రస్తావనవిషయంలో అశ్రద్ధ కలిగినట్టు కనపడుతుంది.

ఇప్పుడు కాంగ్రెస్సు వర్కింగుకమిటీమెంబరుషిప్పు కూడా వచ్చింది. ఇక అది అనవసరమే అని తోస్తుందేమో?

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

హరిపురం కాంగ్రెస్సుకి వెళ్ళిన నవశక్తి ప్రత్యేకప్రతినిధి యిలా గోలపెడుతున్నారు.

"కాంగ్రెస్సు విషయనిర్ణయసభ జరగడానికి ఒక రోజు ముందే నేను హరిపూర్‌లో దిగాను. కాని నేను చూచిన దృశ్యాన్ని బట్టి మరొక రెండు రోజులు ముందుగా రావలసి యుండే దని యెంతో విచారించాను. కారణం ఏమంటే?—విఠల్‌నగర్‌లో యెక్కడ చూచినా, గుజరాతీ భాషే తప్ప మరొక భాషే కనపడలేదు. ఇదివరలో నేను జైల్లో నేర్చుకున్న హిందీ హరిపూర్‌లో సహాయకారి కాకపోతుందా అనుకున్నాను. కాని, ప్రతినిధుల క్యాంపులు, ప్రేక్షకుల క్యాంపులు, పాయఖానాలు, స్నానపుకొట్టాయిలు, వంటశాలలు—వీటి అన్నిటి పైనా గుజరాతీ భాషే గాని రెండో భాష కనపడలేదు. వాలంటీర్లు మాట్లాడే భాష గుజరాతీ, దేశసేవికలు మాట్లాడే భాష గుజరాతీ, కెప్టెన్లు కూడా అదే భాష, ఎవరికీ హిందీ తెలియదు. ఇంగ్లీషు అసలే మాట్లాడరు కదా యీ పల్లెటూరి కాంగ్రెస్సులో?"

ఏమిటి యీ ఘోరన్యాయం?

గాంధిగారూ, పటేలుగారూ తమ రాష్ట్రంలో మాత్రం హిందీని అడుగుపెట్టనివ్వరా యేమిటి?

తమ భాష అంటే వారి కంత తీపా? ఇతర్ల భాషలు మాత్రం మట్టికొట్టుకు పోవాలా?

గాంధిగారు దక్షిణదేశభాషలను చంపెయ్యడానికే ప్రయత్నం పట్టారంటే యెగసిపడేవారెవ్వడయినా కళ్లు తెరుస్తారా?

కాంగ్రెస్సులో కూడా హిందీకి బలాదూరు సంభవించినప్పుడా హిందీని మనవాళ్లెందుకు నేర్చుకోవాలి? హిందీప్రచారంలో దౌర్జన్యం తప్ప మరేమేనా కనపడుతున్నదా?

ఇంతకీ:

ఇందులో మన కాంగ్రెస్సుముగ్ధులకూ హిందీదాసులకూ జ్ఞానోదయం కలిగించే సన్నివేశం వొకటి వున్నది.

మన ఆంధ్రదేశంలో మళ్ళీ కాంగ్రెస్సు జరిగితే మన ఆహ్వానసంఘాధ్యక్షుడు కాంగ్రెస్సు కాంపులో వ్యవహారం అంతా ఆంధ్రంలోనే జరగాలని విధించగలడా? విధిస్తే తక్కిన సభ్యులు ఆయనను బతకనిస్తారా? వారు బతకనిస్తే, కెప్టెనులూ, దేశసేవికలూ—చివరికి వాలంటీర్లూ ఆయన ఆజ్ఞలను మన్నిస్తారా?

సామాన్యభాషట, జాతీయభాషట, ఏభాషకు ఎంత విలవ యివ్వాలో, గాంధిగారు ఎలాంటి వుచ్చులు పన్నుతున్నారో తెలుసుకోలేని ఆంధ్రులకు సామాన్యభాషా, జాతీయభాషా కూడా కావాలా?

ధిక్!

సిగ్గు సిగ్గు.

ఆధునికాంధ్రవాఙ్మయం

నాళం కృష్ణారావుగారివి

1 కోనచినుకులు 0-8-0, 2 పాలతరగలు 0-8-0, 3 గోరుముద్దలు 0-4-0, 4 విరాగడకరోలు 0-5-0, 5 తెమ్మబుడగలు 0-6-0, 6 గోకీతము 0-2-0, 7 హైదిరేది 0-2-0, 8 ముద్దు 0-4-0, 9 దీపావళి 0-8-0, 10 విరిదండ 0-8-0.

ఉన్నవ లక్ష్మీనారాయణగారివి

1 నాయకురాలు 1-0-0, 2 సంగీతవాదసారి 0-1-0, 3 సోది 0-1-0, 4 భావతరంగాలు 0-1-0, 5 హరిజననాటకం 0-1-0.

కవితా సమితివారివి

1 వైశాఖి 1-0-0, 2 ఉత్కలపతనము 0-12-0, 3 ప్రభవ 0-8-0 4 పూలమాల 0-4-0.

మునిమాణిక్యం నరసింహారావుగారివి

1 కాంతంకథలు 1-0-0, 2 నేనూ మా కాంతం 0-4-0, 3 ఉపాధ్యాయుడు 0-8-0, 4 వక్రరేఖ 1-0-0.

పురాణం సూరిశాస్త్రిగారివి

1 నాట్యోత్పలం 1-0-0, 2 నాట్యాలోకం 1-0-0, 3 విమర్శకపారిజాతం 1-0-0, 4 ఆంధ్రనాటక సంస్కరణం 0-4-0.

ప్రకీర్ణకాలు

1 శాకాభంగం 0-12-0, 2 గోల్కొండకవుల సంచిక 2-0-0, 3 ఉచ్ఛలవిషాదం 0-12-0, 4 రెడ్డికుల నిర్ణయచంద్రిక 1-4-0, 5 సంఘోద్ధరణం 0-6-0, 6 కర్నూలు రాజవంశావళి 0-2-0, 7 ప్రాచీనాంధ్ర నౌకాజీవనచారిత్రం 1-0-0, 8 మునిమాపు 0-12-0, 9 వకుళమాల 0-12-0, 10 సుందరి 1-0-0, 11 నాటకోపన్యాసములు 1-0-0, 12 హృదయ విహంగము 0-4-0, 13 ఆంధ్రమహాసామ్రాజ్యము 1-4-0, 14 Age of Mahabharatawar 1-0-0, 15 జడగంటలు 0-8-0, 16 రహస్యరేఖ 0-8-0, 17 చక్రపాణి 0-8-0, 18 ఆంధ్రకావ్యాలంకారసూత్రవృత్తి 1-4-0, 19 సచ్చిదానందం 1-0-0, 20 గీతమాలిక 0-12-0, 21 సోమనాథవిజయం 0-12-0, 22 భాగవతావతరణం 0-8-0, 23 నవకుసుమాంజలి 1-4-0, 24 చంద్రగుప్త 1-4-0, 25 పునర్వివాహం 1-0-0 26 సాహిత్యమీమాంస 1-8-0, 27 నాటకవిమర్శ 2-0-0, 28 [illegible] 0-8-0, 29 వేయిస్తంభాలగుడిశాసనం 2-0-0, 30 మల్లికార్జునరావు 0-10-0, 31 ఆంధ్రకావ్యోదయం 0-8-0, 32 రత్నాపణం 0-8-0, 33 విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర 1-8-0, 34 సంజయ రాయబారం 1-0-0, 35 కృష్ణరాయబారం 1-0-0, 36 కృష్ణసంజయరాయబారం 2-0-0, 37 కర్ణచరిత్ర 0-10-0, 38 శ్రీకృష్ణుడు 0-8-0, 39 కారవాక 1-0-0, 40 అపుడు 0-8-0, 41 అప్పుడు 0-8-8, 42 ఇప్పుడు 0-8-0, 43 విజం 0-8-0, 44 కాలక్షేపం 0-8-0, 45 రసాంజలి 0-2-0, 46 వసంతము 0-4-0.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారివి

1 రక్షాబంధనం 1-0-0, 2 శ్మశానవాటిక 0-8-0, 3 వారకాంత 0-4-0, 4 [illegible] 0-2-0, 5 కలంపోటు 0-3-0 6 విజయనగరరాజుల కథలు 0-2-0, 7 చిత్తూరు రాజులకథలు 0-3-0, 8 ఢిల్లీచక్రవర్తుల కథలు, 0-3-0, 9 గోల్కొండనవాబుల కథలు 0-1-0 10 ప్రబుద్ధాంధ్ర అయిదోసంపుటం స్త్రీలకాగితాలు చక్కని బైండింగు 2-0-0.

కురుగంటి సీతారామయ్యగారివి

తంజావూరాంధ్రనాయకరాజుల చరిత్ర. 2-0-0

రాయప్రోలు సుబ్బారావుగారివి

1 కవితాంజలి 1-0-0, 2 జడకుచ్చులు 1-0-0

చిలుకూరి వీరభద్రరావుగారివి

1 ఆంధ్రులచరిత్ర 5వ భాగం 2-0-0, 2 శ్రీనాథమహాకవి 2-0-0 3 అళియరామరాయలు 1-8-0, 4 తిమ్మరుసుమంత్రి 1-0-0.

గొబ్బూరి వేంకటానందరాఘవరావుగారివి

మహామేధావులు. 1-0-0

మారేపల్లి రామచంద్రశాస్త్రిగారివి

1 తెనుగు తోబుట్టువులు 0-8-0, కవిగారి మనుగడ 0-8-0.

డాక్టరు గాళ్లపల్లి నారాయణమూర్తిగారివి

ఆరోగ్యశాస్త్రము 2-0-0

(ఇది ఆంధ్రయూనివర్సిటీవారేర్పరిచిన పోటీపరీక్షలో అత్యుత్తమమైనదని నిశ్చయించబడి గొప్ప బహుమతి పొందిన గ్రంథము)

R. V. R. జగపతివర్మగారివి

1 పెద్దాపురసంస్థానచరిత్రము 1-0-0, 2 పద్మనాభయుద్ధము 0-12-0, 3 రామవిలాసము 0-10-0, 4 ఆంధ్రులకథలు 0-10-0, 5 ఆంధ్రదేశకథలు 0-12-0.

కృష్ణకౌండిన్యులవారివి

నందనారుచరిత్రనాటకము 0-8-0

టేకుమళ్ల కామేశ్వరరావుగారివి

1 లోపదారిమొగుడు 5 అంకాలనాటకం 0-4-0, 2 జానకి ప్రేమ మొదలైన చిన్నికథలు 0-5-0.

మొక్కపాటి నరసింహశాస్త్రిగారివి

1 ప్రతిబింబములు (చిన్నకథలసంపుటి) 0-12-0, 2 ఏకోదరులు (నవల) 0-8-0.

మారేమండ రామారావుగారివి

1 మధ్వాచార్యులవారి చరిత్ర 1-0-0, 2 భారతీయవిద్యాచరిత్ర 0-12-0.

తుపాకుల అనంతభూపాలునిది


విష్ణుపురాణము వచనము 0-12-0

(ఇది ఆంధ్రకవుల చరిత్రలో ప్రకటింపబడిన పూర్వపువచనగ్రంథము

కలాభివర్ధనీ పరిషత్తు రాజమండ్రి

సౌందర్యం లేకపోతే బతుకెందుకూ?

ఇలాంటి సౌందర్యానికి పరిశుద్ధమైన రక్తం చాలా అవసరం



గంధర్వకళ క్రొత్త రక్తం పెట్టి శరీరానికి పుష్టి, బలమూ, తేజస్సూ కలిగిస్తుంది

స్త్రీలకు బింకమూ, పురుషులకు వీర్యవృద్ధీ కలిగిస్తుంది

మరచిపోవద్దు దానిపేరు

గంధర్వకళ

షా ను 3—0—0

గంధర్వ ఫార్మసీ ఇన్నిస్‌పేట, రాజమండ్రి

రాజమహేంద్రవరము : శ్రీ అద్దేపల్లి లక్ష్మణస్వామి నాయుడు గారిచే సరస్వతీ పవర్ ప్రెస్సునందు ముద్రితమై
శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే ప్రకటింపబడినది. [illegible]